


ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.60 (305.8626)	34,468	37,779
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.30 (4.28)	1566.19	2,493.07
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.587 (43.5968)	35,233	65,064

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

జలసంరక్షణలో జిల్లాకు కేంద్ర పురస్కారం



నల్లగొండ మండలం కేశరాజుపల్లి వద్ద నిర్మించిన కృత్రిమచెరువు

- రూ.2కోట్ల నగదు, అవార్డు ప్రకటించిన కేంద్ర జలశక్తి శాఖ
- జల్ సంచయ్, జన్‌భాగీధారి కార్యక్రమ అమలులో దక్షిణభారత దేశంలో ఉత్తమ పనితీరు

వర్షపు నీటి సంరక్షణ, భూగర్భజలాల పెంపు చర్యలు అమలు చేయడంలో ఉత్తమ పనితీరుకు గాను జిల్లాకు జాతీయస్థాయిలో అత్యున్నత పురస్కారం దక్కింది. కేంద్ర జలశక్తి శాఖ అమలు చేస్తోన్న 'జల్ సంచయ్, జన్ భాగీధారి' కార్యక్రమం కింద చేపట్టిన పనులకు జిల్లాకు ఈ గుర్తింపు లభించింది.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి- నల్లగొండ)

దేశంలో దక్షిణాది విభాగంలో మొదటి కేటగిరీ కింద ఎంపికచేసిన మూడు జిల్లాల్లో నల్లగొండతో పాటుగా ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలకు చోటు దక్కింది. జిల్లాలో చెరువుల, పాతబావుల పునరుద్ధరణ, కాంటూరు కందకాలు, వర్షపునీటి నిల్వ చేసే కృత్రిమ చెరువుల నిర్మాణాలు, చెక్‌డ్యామ్ వంటి నిర్మాణాలు, గ్రామాలు, ఆవాసాలలో ఇంకుడు గుంతల నిర్మాణాల్లో నిర్ణీత లక్ష్యానికి మించిచేసిన పనులు సంతృప్తికరంగా ఉండడంతో ఈ అవార్డుకి జిల్లాని మొదటి కేటగిరీ కింద ఎంపిక చేశారు. ఈ కేటగిరీ కింద ఇచ్చే పురస్కారాలను ఈ నెల 18న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అందజేస్తారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఆర్‌డీఏ పీడీ వై శేఖర్‌రెడ్డి హాజరవుతారు. ఈ పురస్కారంతో పాటుగా రూ.2 కోట్ల నగదు బహుమతి సైతం జిల్లా అధికారులకు అందజేస్తారు. జిల్లాకు ప్రతిష్టాత్మకమైన కేంద్ర పురస్కారం రావడంపై కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని అభినందించారు.

జిల్లాలో 13 విభాగాల్లో 84,827 పనులు

జల్ సంచయ్, జనభాగీధారి కార్యక్రమం కింద జిల్లాలో వర్షపునీటి సంరక్షణ, భూగర్భజలాల సంరక్షణకు 13 రకాలైన పనులను చేపట్టారు. మొత్తం 84,827 పనులను రూ.98.02 కోట్లతో నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి, నీటినిర్వహణ యాజమాన్యసంస్థ ఆధ్వర్యంలో ఈ పనులను ప్రతిష్టాత్మకంగా పూర్తిచేశారు. ప్రధానంగా వర్షపునీటిని, వరద నీటిని నిల్వ చేసే పనులను చేపట్టారు. కాంటూరు కందకాలు, నీటి కందకాలు, చెరువుల పునరుద్ధరణ, పాతబావుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు, ఇంకుడుగుంతల వంటి నిర్మాణాలు చేపట్టారు. ఈ పనులను నిర్ణీత గడువు ప్రకారం పూర్తిచేసి ఎప్పటికప్పుడు

మిగతా 8వ పేజీలో

జిల్లాలో చేపట్టిన పనుల వివరాలు

పనివివరం	పనుల సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
గుట్టల ప్రాంతాల్లో కాంటూరు కందకాలు	128	1.28
వ్యవసాయ గట్ల వద్ద కందకాల నిర్మాణాలు	1256	12.56
వర్షపు, వరద నీటి నిల్వ కందకాలు	658	6.58
వదులుగా ఉండే రాతి నిర్మాణాలు	2956	3.84
రాక్‌ఫిల్ డ్యామ్‌ల నిర్మాణాలు	896	1.79
తీగబుట్టలతో తయారుచేసిన నిర్మాణాలు	63	2.21
మినీ కృత్రిమచెరువులు	463	4.63
వర్షపునీరు ఇంకేందుకు తవ్విన కృత్రిమచెరువులు	127	4.45
చెక్‌డ్యామ్‌లు	253	4.53
మట్టికట్టపనులు	7596	7.59
వ్యవసాయచెరువులు	9495	23.73
బోరుబావుల రీచార్జి నిర్మాణాలు	792	15.84
ఇంకుడుగుంతలు	60,144	9.27
మొత్తం	84,827	98.02

జాతిని ఏకీకృతం చేయడంలో పటేల్ పాత్ర కీలకం

- ఎంపీ కేసరి దేవ్ సిన్హా జ్వాల
- నల్లగొండలో యూనిటీ ర్యాలీ



యూనిటీ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ కేసరి దేవ్ సిన్హా జ్వాల

నల్లగొండ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత, దేశభక్తిని పెంపొందించడం, ప్రత్యేకించి జాతిని ఏకీకృతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర కీలకమని ఎంపీ కేసరి దేవ్ సిన్హా జ్వాల అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సర్దార్ 150 యూనిటీ మార్చ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో జాతి నిర్మాణంలో యువతను ప్రోత్సహించడం, యువత ఆలోచనలను ఆచరణలో పెట్టి దేశ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మార్చ్‌కు హాజరైన అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రమాణం చేశారు. ఈ యూనిటీ మార్చ్ నాగార్జున డిగ్రీ కళాశాల నుంచి బయలుదేరి క్లాక్‌టవర్ సెంటర్, ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు కొనసాగింది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నారాయణ అమిత్, ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి అక్బర్ అలీ, మై భారత్ స్టేట్ సభ్యులు అనుస్మాన్, ప్రసాద్ దాస్, యూత్ కోఆర్డినేటర్ రాజేష్, సాయి కృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, చంద్రశేఖర్, పోతేపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, మండల వెంకన్న, మహేష్ పాల్గొన్నారు.

వయోవృద్ధులతో ప్రేమగా ఉండాలి

- కలెక్టర్ ఇలాత్రిపాఠి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ(కలెక్టరేట్), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులతో ప్రేమగా మెలగాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి, బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలాత్రిపాఠి మాట్లాడుతూ వృద్ధులు ఆయురారోగ్యాలతో ఉన్నప్పుడే కుటుంబం ఆనందంగా ఉంటుందన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జిల్లాస్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 13న వృద్ధ ఆశ్రమాల్లో ఆటల పోటీలు, వినోద కార్యక్రమాలు ఉంటాయని, 14న వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు, 15న సీనియర్ సిటిజన్ హక్కులపై మారథాన్ వాక్, 17న జిల్లా, డివిజన్‌స్థాయిలో సీనియర్ సిటిజన్ చట్టం-2007పై అవగాహన, 18న ప్రజాప్రతినిధులకు అవగాహన ఉంటుందన్నారు. 19న జిల్లాలోని వయోవృద్ధులకోసం పనిచేసిన వారి సేవలను గుర్తించి సన్మాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి కేవీ కృష్ణవేణి, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, డీఆర్డీఏ పీడీ శేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ సంస్థ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ హఫీజ్‌ఖాన్

నల్లగొండ కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ 58వ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 తేదీవరకు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా చైర్మన్ ఎం.ఏ హఫీజ్‌ఖాన్ తెలిపారు. బుధవారం జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14వ తేదీన భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలలదినోత్సవం, 15వ తేదీన నూతన పుస్తకాల ప్రదర్శన, రీడింగ్ అవర్, 16వ తేదీన గ్రంథాలయ, డిజిటల్ లైబ్రరీపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. దాతల నుంచి పుస్తకాల సేకరణ, గ్రంథాలయ ఉద్యమకారుల సేవలను స్మరించుకోవడం వంటి కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. 17న ధ్యానం, వ్యక్తిత్వ వికాస కార్యక్రమం, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచనపోటీలు, ఉత్తమ గ్రంథాలయ పాఠకులు, పాఠకురాలికి సన్మానం, బుచ్చిరెడ్డి రచించిన ఊగుతున్న ఉయ్యాల బాలగేయ పుస్తకావిష్కరణ ఉంటుందని తెలిపారు. 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, నా గ్రంథాలయం- నాకు ప్రోత్సాహంపై చర్చావేదిక, గ్రంథాలయంలో చదువుకుని ఉద్యోగం సాధించిన వారి ఉపన్యాసాలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా ముగ్గులు, రంగోళి పోటీలు, పిల్లల కుర్చీ ఆట, మహిళలతో చర్చావేదిక, 20న అక్షరాస్యతా దినోత్సవంతోపాటు వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. పట్టణ ప్రజలు, కవులు, రచయితలు, సాహితీవేత్తలు, పాఠకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బానోతు బాలమ్మ, గ్రంథపాలకులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు

- ఉద్యాన, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి పి. అనంతరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అనంతరెడ్డి

తిప్పర్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించాలని ఉద్యాన, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి పి.అనంతరెడ్డి అన్నారు. బుధవారం తిప్పర్తి మండలం కంకణాలపల్లిలో ఉద్యాన, వ్యవసాయ శాఖల సమన్వయంతో పీఏసీఎస్ చైర్మన్ పాశం సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ రైతులు మూడేళ్లు ఆయిల్ పామ్ సాగుచేస్తే 30 ఏళ్లు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి కృష్ణ, పలు కంపనీ ప్రతినిధులు వేణు పాల్గొన్నారు.

బిందు సేద్యం కోసం ఎన్నాళ్లో.. ఈ నిరీక్షణ

- రైతులకు డ్రిప్ మంజూరులో నిర్లక్ష్యం



నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాలతోపాటు వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలకోసం ప్రభుత్వం బిందు సేద్యం అమలు చేయాలని చూసినా, నల్లగొండ జిల్లాలో మాత్రం పరికరాల పంపిణీ ఆలస్యమవుతుంది. దీంతో రైతులకు నిరీక్షణ తప్పడంలేదు. డ్రిప్ మంజూరుకోసం దరఖాస్తులు సమర్పించి నెలలు గడుస్తున్నా దరఖాస్తుల పరిశీలన ముందుకు సాగడంలేదు. ఉద్యానశాఖ యంత్రాంగం పట్టించుకోకపోవడం వల్లే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, సకాలంలో డ్రిప్ పరికరాలు రావడం లేదని రైతులు వాపోతున్నారు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

పండ్ల తోటలు మొదలుకొని కూరగాయల సాగు వరకు డ్రిప్ అవసరం ఎంతగానో ఉంటుంది. ముఖ్యంగా నీటివనరులు తక్కువగా ఉన్నప్పుడు డ్రిప్ ఏర్పాటు చేసినట్లయితే ఉద్యాన పంటలకు ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. గత బీఆర్ఎస్ హయాంలో దాదాపు ఐదేళ్లపాటు బిందు సేద్యానికి నిధులు కేటాయించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరం తర్వాత బిందు సేద్యానికి కేటాయించినా, జిల్లాలో మాత్రం ఆ పథకం అటకెక్కింది. దీన్ని ప్రధాన కారణం అధికారుల నిర్లక్ష్యమనేది స్పష్టంగా తెలుస్తుంది. గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత ప్రభుత్వంలో సైతం బడ్జెట్‌లో బిందు సేద్యానికి అరకొరగా నిధులు కేటాయిస్తూ వస్తుంది. కనీసం ఆ నిధులైనా ఖర్చు చేసి పథకాన్ని అమలు చేయాల్సిన అధికారులు ఫైళ్లను అటకెక్కించారన్న ఆరోపణలు వస్తున్నాయి.

రీఎస్టిమేషన్ పేరిట కాలయాపన

కేంద్ర ప్రభుత్వం పలు రంగాలపై, పరికరాలపై, వస్తువులపై జీఎస్టీ తగ్గించిన తర్వాత ఎంతో ఊరట కలిగింది. ఇందులో భాగంగా డ్రిప్ సామగ్రిపై సైతం 12శాతం నుంచి 5శాతానికి తగ్గడం వల్ల రైతులకు ఈ పథకం ఎంతగానో ఉపయోగంలోకి వస్తుందని రైతులు సర్వత్రా భావించారు. అయితే రైతులకు ప్రయోజనం చేకూర్చడంకోసం ఫైళ్లను పరిశీలిస్తామని, రేట్లు తగ్గినందున రైతులకు డీడీలు కట్టే సమయంలో ఉపయోగం ఉంటుందని చెబుతున్నా, ఉద్యానశాఖ అధికారులు ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారన్న ప్రశ్న తలెత్తుతుంది.

తగ్గిన యంత్ర పరికరాల ధరలు

వ్యవసాయశాఖకు సంబంధించి యాంత్రీకరణ పథకంలో యంత్ర పరికరాలకు సైతం జీఎస్టీ వల్ల ధరలు తగ్గాయి. వ్యవసాయశాఖ ఈపాటికే స్పందించి తగ్గినరేట్లకు అనుగుణంగా పథకాన్ని అమలుచేస్తూ ముందుకు సాగుతుంది. ఉద్యానశాఖ ఈ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారనే దానిపై సర్వత్రా చర్చ సాగుతుంది. రైతులకు ఉపయోగం కలుగుతున్న నేపథ్యంలో తక్షణమే రిఎస్టిమేషన్ చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న 1000 ఫైళ్లకు పైగా సకాలంలో పరిశీలించి పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత శాఖపై ఉన్నా, అధికారులు మాత్రం ఆ వైపుగా దృష్టిసారించడంలేదు. రిఎస్టిమేషన్ చేయడంకోసం ఎందుకు ఇంత సమయం తీసుకుంటున్నారన్న ప్రశ్న తలెత్తుతుంది. జీఎస్టీ తగ్గిన వెంటనే ఆయా కంపెనీల నుంచి కొత్తగా కొటేషన్ తీసుకొని రైతులను ఎంపిక చేసి వారి నుంచి డీడీలను సకాలంలో

మిగతా 8వ పేజీలో..

జనగణన సర్వే వేగవంతం చేయాలి

- తెలంగాణ డైరెక్టర్ భారతీ హోలీకేరి



వివరాలు తెలుసుకుంటున్న హోలికేరి

తిప్పర్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జనగణన కార్యక్రమంలో భాగంగా చేస్తున్న సర్వే వివరాలను వేగవంతం చేయాలని ఆ శాఖ తెలంగాణ డైరెక్టర్ భారతి హోలికేరి ఆదేశించారు. తిప్పర్తి మండల కేంద్రంలో జనగణన కార్యక్రమాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఎన్యూమరేటర్ సర్వే చేస్తున్న ప్రదేశాలను స్వయంగా వెళ్లి పరిశీలించారు. సర్వేలో భాగంగా ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తహసీల్దార్ ఆర్. రామకృష్ణ, ఎస్ఐ. వి. శంకర్, ఆశాఖ అధికారులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

నల్లగొండ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. బీసీలకు చట్టసభల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు సాధించేంచే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ ఉద్యమం ప్రజాస్వామ్య బద్ధంగా బీసీల ఆత్మగౌరవం కోసం, అవమానాలకు వ్యతిరేకంగా కొనసాగుతుందన్నారు. రాష్ట్రాలు రిజర్వేషన్లు పెంచుకోవచ్చని రాజ్యాంగంలోని 243/డి6 షెడ్యూల్ స్పష్టంగా ఉందన్నారు. కానీ రిజర్వేషన్లు 50 శాతానికి పరిమితం చేయడం ఏంటని ప్రశ్నించారు. బీసిలు ఎంత ఉన్నారో.. తమకు అంత రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్, చిలకరాజు సతీష్, పుట్ట వెంకన్న గౌడ్, చెన్నూరి భరద్వాజయాదవ్, కొంపల్లి రామన్నగౌడ్, పృథ్వీరాజ్, మహేష్ కుమార్, మణికంఠ, రాజేష్, రవి, తరుణ్, మల్లేష్, పృథ్వీ, రామ్ చరణ్, సాయి తేజ, శంకర్, యాదగిరి, సత్యనారాయణ ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘాల నాయకులు

కృష్ణాజలాలు అందాయా.. ఆలోచించండి

- సమస్యలు తెలుసుకోవడానికే జనంబాట
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

7

ప్రసవాల నిర్వహణలో రాష్ట్రంలోనే ముందు

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ప్రత్యేక దివ్యాంగ గుర్తింపు కార్డుల జారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రసవాల నిర్వహణలో జిల్లాకేంద్ర ఆసుపత్రి రాష్ట్రంలోనే ముందుందని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డివెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రూ.30లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల జారీ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఉస్మానియా, గాంధీ తర్వాత ఎక్కువగా ప్రసవాలు నిర్వహించే అతిపెద్ద ఆస్పత్రిగా నల్లగొండ జీజీహెచ్ పేరుపొందిందని, ప్రతీనెల 700 నుంచి 800 వరకు ప్రసవాలు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఉన్న సదరం శిబిరం కేంద్రంలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కాదని, సౌకర్యాల లేమితో వైకల్యం కలిగిన వారు అనేక ఇబ్బందులు ఎదుర్కోవడాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.30లక్షలతో నూతన భవనాన్ని నిర్మించి దివ్యాంగులకు కొత్త భవనంలో తాగునీరు, టాయిలెట్స్, ర్యాంపు, ఇతర అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైకల్యం కలిగిన వారు ఇక ప్రతీవారం ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్టిఫికెట్లు పొందవచ్చన్నారు. ఆసుపత్రిలో అన్ని అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇటీవలే బేబీ వార్మ్, లాప్రోస్కోపిక్ మిషన్ వంటివి ఏర్పాటు చేశామని, రూ.2లక్షల నుంచి రూ.3లక్షల విలువ చేసే ఆపరేషన్లు సైతం ఉచితంగా చేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైతే ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తామన్నారు. ప్రసవాలకోసం ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా జిల్లా కేంద్ర ఆస్పత్రికి రావాలన్నారు. వైద్యసేవలలో నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలపాలన్నదే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలాత్రిపాఠి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ కుమారి, ఆర్ఎంవో పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను సవ్యంగా పూర్తిచేయాలి

నల్లగొండ (కలెక్టరేట్): అధికారులు, రైస్ మిల్లర్లు రాత్రి, పగలు పనిచేసి ధాన్యం కొనుగోలును సవ్యంగా పూర్తిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. కలెక్టరేట్‌లో ధాన్యం, పత్తి సేకరణ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అకాల వర్షాలు, తుఫాన్‌తో ధాన్యం సేకరణలో ఇబ్బందులు కలిగాయని, కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున, అవసరమైతే లైట్లు ఏర్పాటుచేసి రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, పౌరసరఫరాల జిల్లా అధికారి వెంకటేష్, జిల్లా మేనేజర్ గోపికృష్ణ, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భానుడు రాకముందే బతుకు పోరాటం

మంచు కురిసే వేళలో నిర్మానుష్యంగా ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లాక్రేందంలో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే దిన చర్య ప్రారంభమైంది. పట్టణమంతా నిద్రిస్తున్న వేళా పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు మునిసిపల్ పారిశుధ్య కార్మికులు సిద్ధమయ్యారు. తాజా కూరగాయలతో చిరు వ్యాపారుల రాక మొదలైంది. దుకాణాలు తెరిచేందుకు వ్యాపారులు సిద్ధమయ్యారు. ఆర్టీసీ ఉద్యోగులు బస్టాండ్‌కు చేరుకున్నారు. పేపర్ బాయ్స్ పత్రికలను సిద్ధం చేసుకున్నారు. టీ తాగేందుకు అక్కడున్న వారు టీస్టాల్ వద్దకు చేరుకున్నారు.


విధులకు హాజరవుతున్న ఆర్టీసీ సిబ్బంది


పట్టణానికి ఆకు కూరలు తెస్తూ..


ప్రపంచానికి వార్తలు పంచుతాం.. పేపర్లు సరి చేసుకుంటున్న ఏజెంట్లు



డ్యూటీ చార్ట్ రెడీ.. ఆర్టీసీ విచారణ కేంద్రం




గస్తీ తిరుగుతున్న పోలీస్ వాహనం



పట్టణాన్ని అందంగా ఉంచుతాం.. పారిశుధ్య కార్మికులు సిద్ధం


చాయ్ రెడీ


చాయ్ ఎంజాయ్


బస్టాండ్.. ప్రయాణికుల రాక కోసం ఎదురు చూపు


బతుకు బండి షురూ.. ఆటో శుభ్రం చేసుకుంటున్న డ్రైవర్




చిరు వ్యాపారులు


● ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటో గ్రాఫర్ యాదాద్రి

కనగల్ వాగులో పడి రైతు మృతి


చిట్టిమళ్ల పెద్దులు(ఫైల్)

కనగల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ వాగు నీటి మడుగులో పడి రైతు మృతిచెందాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రాజీవ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... కనగల్ గ్రామానికి చెందిన రైతు చిట్టిమళ్ల పెద్దులు(54) వాగు అవతలి ఒడ్డునున్న తన పొలం వద్ద ఆరబెట్టిన ధాన్యం కుప్ప పోసేందుకు ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. పొలం నుంచి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఇసుక క్వారీ గుంత నీటిలో పడి మృతిచెందాడు. చీకటి అయినా పెద్దులు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. ఎంత వెతికినా అతని ఆచూకీ దొరకలేదు. బుధవారం మధ్యాహ్నం అటుగా వెళ్లిన పశువుల కాపరులకు నీటిలో తేలిన మృతదేహం కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. కుళ్లిన దశలో ఉన్న మృతదేహాన్ని రైతు పెద్దులుదిగా గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సైదులుకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక క్వారీనే ప్రాణం తీసిందా?

ఇసుక క్వారీ గుంటే రైతు పెద్దులు ప్రాణాలను తీసిందని స్థానికులు వాపోతున్నారు. యంత్రాల సాయంతో అనధికారికంగా వాగులో ఇసుక తవ్వకాలు జరపగా పెద్దపెద్ద గోతులు ఏర్పడినట్టు తెలుస్తోంది. ఇటీవల కనగల్ వాగులో వరద నీరు చేరడంతో ఆ గోతులు నీటి మడుగులుగా మారాయి. ఈ నేపథ్యంలో వాగును దాటుతూ పొలం వద్దకు వెళ్లి వస్తున్న క్రమంలో పెద్దులు మడుగు నీటిలో పడిపోయి మృతిచెందాడని భావిస్తున్నారు.

ఇంట్లో చోరీ.. రూ.8లక్షలు అపహరణ

దేవరకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని హన్‌మాన్‌నగర్‌లోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి, బాధితుడు జబ్బర్ తెలిపిన వివరాల ప్రకారం... హనుమాన్‌నగర్‌కు చెందిన జబ్బార్ పాన్‌షాపుతో పాటు చిట్టీల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల తన సొంత భూమి విక్రయించగా వచ్చిన నగదు రూ.8లక్షలను బీరువాలో ఉంచాడు. మంగళవారం భార్యభర్తలు కలిసి పాన్‌షాపు వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలు గొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న రూ. 8లక్షల నగదు కన్పించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకట్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడు జబ్బార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్షుద్ర పూజల కలకలం

కొండమల్లేపల్లి, నవవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. మండలంలోని ఏపూర్‌తండాకు వెళ్లే దారిలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగుపై కుంకుమ చల్లి కొబ్బరికాయలు కొడుతుండగా అటుగా వెళ్తున్న వ్యక్తులు గమనించడంతో సదరు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఘటనా స్థలాన్నికి వెళ్లి బ్యాగును పరిశీలించగా అందులో ఒక చీర, పూలు ఉన్నట్లు గుర్తించారు. ఆకతాయిలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు కావాలని ఇలా చేసి ఉంటారని పోలీసులు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామన్నపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ డి. నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... ఎలాంటి అనుమతులు లేకుండా మండల పరిధిలో బుధవారం రాత్రి ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. విశ్వసనీయ సమాచారం మేరకు శోభనాద్రిపురం గ్రామ శివారులోని మూసీవాగు సమీపంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని అదే గ్రామానికి చెందిన డ్రైవర్లు పాల నరేష్, ముక్కాముల నరసింహాలును విచారించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేసి ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గంజాయి సేవిస్తున్న ఐదుగురిపై కేసు

నల్లగొండ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి సేవిస్తున్న ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... వన్‌టౌన్ పరిధిలో గతంలో గంజాయి సేవిస్తున్న వారిని పట్టుకొని వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా వారిలో మార్పు రాకపోగా, తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టడంతో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు సైదులు, సతీష్ నిఘా పెట్టి గంజాయి సేవిస్తున్న వారిని కోర్టుకు పంపారు. వారి తల్లిదండ్రులు తమకు ఒక అవకాశం ఇవ్వాలని కోర్టును అభ్యర్థించడంతో పాటు న్యాయస్థానం ఆదేశాల మేరకు డ్రగ్ రీహ్యాబిటేషన్ సెంటర్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

వాయిదాలకు హాజరుకాని నిందితుడికి జైలు

తిరుమలగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని జడ్జి జైలుకు పంపారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మరిపెల్లి సత్యనారాయణపై తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తుంగతుర్తి కోర్టుకు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. పోలీసులు బుధవారం అతనిని అదుపులోకి కోర్టులో తుంగతుర్తికోర్టులో జడ్జి ఎదుట హాజరుపరిచారు. జడ్జి గౌస్‌పాషా నాయిన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో సబ్‌జైలుకు తరలించినట్లు తెలిపారు.

ఇళ్ల వద్ద బైక్ కనిపిస్తే మాయమే..!

● ఖరీదైన బైక్‌లు లక్ష్యంగా చోరీలు ● బైక్‌లకు చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్టు ● ఒకరిపై 150 బైక్ చోరీ కేసులు

సూర్యాపేటక్రైం, నవంబరు 12,(ఆంధ్రజ్యోతి): ఇళ్లు, దుకాణాల ముందు నిలిపి ఉంచిన ఖరీదైన బైకులను చోరీలకు చేస్తున్న ఇద్దరు నిందితులను సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.20లక్షల విలువైన 26 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం కట్టకొమ్మగూడెం గ్రామానికి చెందిన వేమూరి క్రిష్ణ కొన్నేళ్లుగా బైక్‌లను చోరీ చేసి వాటిని ఇతరులకు విక్రయిస్తూ తద్వారా వచ్చే డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు. అందులో భాగంగా గతేడాది ఫిబ్రవరిలో మిర్యాలగూడెంలో బైకులు చోరీ చేసి అక్కడి పోలీసులకు దొరికి నల్లగొండ జైలులో సుమారు సంవత్సరం పైగా శిక్ష అనుభవించి ఈ ఏడాది మే నెలలో విడుదలయ్యాడు. అప్పటి నుంచి సూర్యాపేట, మిర్యాలగూడెం, ఖమ్మం, పట్టణాల్లో ఖరీదైన బైక్‌లను చోరీ చేస్తున్నాడు. నకిరేకల్‌లో తిరుగుతున్న సమయంలో నకిరేకల్‌లోని ఆర్లగడ్డగూడేనికి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో సెక్యూరిటీగార్డుగా పని చేసే రేఖల శివకుమార్ పరిచయమయ్యాడు. ఇద్దరూ కలిసి బైక్‌లు చోరీ చేస్తున్నారు. క్రిష్ణ చోరీ చేసిన పలు బైక్‌లను విక్రయించాలని శివకుమార్‌కు అప్పగించాడు. ఇలా వారు సూర్యాపేట, మిర్యాలగూడెం, ఖమ్మం పట్టణాల్లోని వివిధ ప్రాంతాల్లో మొత్తం 26 బైక్‌లు చోరీ చేశారు. క్రిష్ణ ఒక్కడే 20 బైక్‌లు చోరీ చేశాడు. ఆరు బైక్‌లను క్రిష్ణ, శివకుమార్ ఇద్దరు కలిసి చోరీ చేశారు. చోరీ చేసిన బైక్‌ల్లో ఒక బైక్‌ను క్రిష్ణ తన వద్ద ఉంచుకుని మిగిలిన 25 బైక్‌లను విక్రయించాలని శివకుమార్‌కు అప్పగించాడు. చోరీ చేసిన బైక్‌ల్లో నాలుగు మాత్రమే శివకుమార్ విక్రయించాడు. ఒక బైక్‌ను శివకుమార్ వాడుతుండగా, మిగితా 20 బైక్‌లు శివకుమార్ ఇంటి వద్ద ఉన్నాయి. బుధవారం ఉదయం సూర్యాపేట పట్టణ పోలీసులు పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో క్రిష్ణ బైక్‌పై నకిరేకల్ వెళ్తున్నాడు. ఆపి తనిఖీ చేయగా బైక్ కాగితాలు లేవని చెప్పాడు. అనుమానంతో ఫిన్స్ యాప్ ద్వారా క్రిష్ణ వేలిముద్రలతో పరిశీలించగా పాత నేరస్తుడిగా నిరూపణ అయింది. వెంటనే క్రిష్ణను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేశారు. విచారణలో కొంత కాలంగా బైక్‌లు చోరీ చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు అంగీకరించాడు. అతడితో పాటు నకిరేకల్‌కు చెందిన శివకుమార్ కూడా చోరీ ఘటనల్లో ఉన్నట్లు తెలిపాడు. వెంటనే పోలీసులు క్రిష్ణను వెంట తీసుకుని నకిరేకల్‌కు వెళ్లి శివకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని ఇంటి వద్ద 25బైక్‌లు లభించాయి. క్రిష్ణ బైక్‌లు చోరీ చేస్తూ వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్యతో కూడా కొన్నేళ్ల క్రితం ఘర్షణ పడి దూరంగా ఉంటున్నాడు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో క్రిష్ణపై మొత్తం 150 బైక్‌ల చోరీ కేసులు ఉన్నాయి. బైక్‌ల దొంగలను పట్టుకున్న పోలీసులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ వి. ప్రసన్నకుమార్, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎ. వెంకటయ్య, ఎస్‌ఐ సురేష్, ఏఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, సిబ్బంది వేములకొండ శ్రీరాములు, ఎన్. వీరభద్రారెడ్డి, నరేందర్, సీహెచ్. రవికిరణ్ ఉన్నారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైకులు చూపుతున్న ఎస్పీ నర్సింహ

తహసీల్దార్ అవమానించారు

● మహిళ ఆరోపణ

ఆత్మకూర్(ఎస్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇంటికి ఇసుక కావాలని స్థానిక తహసీల్దార్ వద్దకు వెళ్లితే ఆఫీస్ నుంచి బయటికి వెళ్లాలని తహసీల్దార్ అవమానించారని మహిళ ఆరోపించింది. ఘటన సూర్యాపేట జిల్లా, ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో బుధవారం జరిగింది. వివరాలలోకి వెళ్లితే... మండల పరిధిలోని నసీంపేట గ్రామానికి చెందిన ఒంటరి మహిళ సామాజిక కార్యకర్త వత్సవాయి లలితకు ఒంటరి మహిళ కింద ఇటీవల ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. పునాది లెవల్ లో పనులు అయ్యాక ఇసుక కొరత కారణంగా నిర్మాణం ఆగింది. బుధవారం ఇదిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తహసీల్దార్ ఇసుక అనుమతులు ఇస్తున్నట్లు సమాచారం తెలియడంతో స్థానిక రెవెన్యూ కార్యాలయానికి లలిత వెళ్లి ఇసుక అనుమతి కావాలని కోరినట్లు తెలిసింది. కొన్ని గ్రామాలకు ఇసుక అనుమతులు ఇచ్చి న తహసీల్దార్ నీకు అనుమతులు ఇవ్వను దిక్కు ఉన్న చోట చెప్పుకొమని అవమానపరిచినట్లు సదరు మహిళ ఆరోపించింది. కొంతమందికి అనుమతులు ఇచ్చి తనకు ఎందుకు ఇవ్వరని అడినందుకు బయటకు వెళ్లామన్నారని ఆరోపించారు.

తహసీల్దార్ వివరణ

ఒంటరి మహిళను అవమానించారని వచ్చిన ఆరోపణలపై తహసీల్దార్ అమీన్ సింగ్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్లకు గతంలో జాజిరెడ్డిగూడెం నుంచి ఇసుక మీరు తెచ్చుకొలేనపుడు మళ్లీ ఇసుక అనుమతులు అని వస్తే ఎలా ఇవ్వాలని అన్నానని తెలిపారు. ఇసుక అనుమతులు ఇంకా ఎవరికీ ఇవ్వలేదని అన్నారు. తాను దుర్భషాలాడలేదని, అమమాన పర్చలేదని అన్నారు.

మద్దతు ధర పొందాలి

మర్రిగూడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన పత్తిని తెచ్చి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర పొందాలని సీసీఐ సెంట్రల్ ఇన్‌చార్జి నీమ్ జై అన్నారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని సరంపేట గ్రామ సమీపంలో ఉన్న హరిహర కాటన్ ఆగ్రో మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి విక్రయాల కోసం వచ్చిన రైతులను ఇలాంటి నిబంధనలు షరతులు విధించకూడదని, 12 తేమ శాతం ఉన్న పత్తిని కొనుగోలు చేయాలని ఆయన పత్తి మిల్లు యజమాన్యం, సీసీఐ సిబ్బందికి సూచించారు. పత్తి విక్రయాల విషయంలో తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మా వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

సీలేరు టూ హైదరాబాద్

● గంజాయి అక్రమ రవాణా ● 24కిలోల గంజాయి పట్టివేత



చౌటుప్పల్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సీలేరు నుంచి హైదరాబాద్‌కు కారులో గంజాయిని తరలిస్తుండగా తెలంగాణ నార్కొటిక్ బ్యూరో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద ఈ సంఘటన జరిగింది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సాంబశివుడు, డ్రైవర్‌గా పనిచేసే శ్రీను, వస్తువులు డెలివరి చేసే ఓ సంస్థలో పనిచేసే యువతి ముఠాగా ఏర్పడి హైదరాబాద్‌లో గంజాయి విక్రయిస్తుంటారు. వీరు రెండు వారాలకు ఒకసారి సీలేరుకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం ముగ్గురు కలిసి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం సీలేరులో 24కిలోల గంజాయిని కిలో మూడు వేల చొప్పున కొనుగోలు చేశారు. ఎక్స్‌యూవి 700 కారులో గంజాయితో హైదరాబాద్‌కు బయలుదేరారు. ఎవరికీ అనుమానం రాకుండా గంజాయిని కారు డిక్కీ, స్టెపినీలో భద్రపరిచారు. అనుమానం రాకుండా ఉండటానికి మహిళను తీసుకెళ్లారు. పక్కా సమాచారం అందుకున్న తెలంగాణ నార్కొటిక్ బ్యూరో, స్థానిక పోలీసుల సహకారంతో పంతంగి టోల్‌గేట్ వద్ద మాటువేసి కారును అడ్డగించి పట్టుకున్నారు. 24కిలోల గంజాయి ప్యాకెట్లు, ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.2.76లక్షలు ఉంటుంది. ముగ్గురు నిందితులను అరెస్టుచేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

పొట్టకూటి కోసం వచ్చి మృత్యువాత


అంబలాన్ దక్షిణామూర్తి(ఫైల్)

నిడమనూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం వచ్చిన ఓ వరి కోతమిషన్ యజమాని మీది నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం బొక్కమంతలపహాడ్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలై జిల్లా చేతపేట మండలం నాచ్చపురం గ్రామానికి చెందిన అంబలాన్ దక్షిణామూర్తి(43) తనకున్న వరి కోత మిషన్‌తో పొలాలు కోసేందుకు నిడమనూరు మండలం బొక్కమంతలపహాడ్ వచ్చాడు. 10రోజులుగా అక్కడే ఉంటూ మిషన్‌తో పొలాలు కోస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి మండలంలోని బొక్కమంతలపహాడ్ గ్రామంలోని ఓ రైతు పొలం కోస్తుండగా మిషన్ యజమాని దక్షిణామూర్తి ధాన్యం లోడు చేసిన ట్రాక్టర్ కింద నిద్రిస్తున్నాడు. కోతమిషన్ యజమాని ట్రాక్టర్ ట్రాలీ కింద పడుకున్న విషయం గమనించకపోవడంతో డ్రైవర్ పసుపులేటి నాగేశ్వరరావు ట్రాక్టర్‌ను ముందుకు కదిలించగా ట్రాక్టర్ దక్షిణామూర్తి తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడున్న వారు గమనించి మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి సోదరుడు రంగనాధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఉప్పు సురేష్ తెలిపారు. దక్షిణామూర్తి పదేళ్లుగా సీజన్‌లో కోతమిషన్‌తో ఇక్కడకు వచ్చి పొలాలు కోసి సీజన్ ముగియగానే సొంత రాష్ట్రానికి వెళ్లిపోయే వాడు.



అంతర పంటతో ఆదాయం

● బొప్పాయి తోటలో బంతిసాగు ● లాభాలు గడిస్తున్న దొండపాడు రైతులు ● ప్రత్యామ్నాయ సాగు పద్ధతులపై దృష్టి

అంతర పంట సాగుతో ఆదాయం పొందుతున్నారు రైతులు. బొప్పాయి తోటలో బంతిసాగు చేసి లాభాలు గడిస్తున్నారు సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామ రైతులు. గ్రామంలో పత్తి, మిర్చి, పంటలు సాగు ఎక్కువగా చేస్తారు. రెండేళ్లుగా మిర్చికి ధర తగ్గడంతో పెరుగుతున్న పెట్టుబడులు, ప్రకృతి వైపరీత్యాలు కారణంగా పంట నష్టపోతుండడంతో ప్రత్యామ్నాయ సాగు పద్ధతులపై దృష్టి సారిస్తున్నారు.

● ఆంధ్రజ్యోతి, చింతలపాలెం

గ్రామ రైతులు బొప్పాయి ప్రధాన పంటగా సాగు చేస్తూ దాని మధ్య ఖాళీ స్థలంలో అంతర పంటగా బంతి పూలతోట సాగు చేస్తున్నారు. ఈ పద్ధతి అదనపు ఆదాయాన్ని చేకూరుతుందని రైతులు అంటున్నారు. బొప్పాయిఇ పంట నాటిన తర్వాత పూర్తి దిగుబడి రావడానికి సుమారు 7 నుంచి 8 నెలల సమయం పడుతుంది. బొప్పాయి తోటలో మొక్కల మధ్య ఖాళీ స్థలం కాలపరిమితి కలిగిన బంతిపూల తోటను అంతర పంటగా సాగు చేసుకుంటే 45 రోజుల్లోనే బంతి పూలు కోతకు వస్తాయి. రైతులకు బొప్పాయి ప్రధానపంట ఆదాయంతో పాటు స్థిరమైన అదనపు ఆదాయ వనరుగా ఉంటోంది. బొప్పాయి తోటకు ఒక ఎకరంలో సంవత్సరానికి సుమారురూ.లక్ష నుంచి రూ.1.20లక్షలు, బంతికి 70 నుంచి రూ.80వేల వరకు ఆదాయం వస్తుంది. బంతిపూల నుంచి పెట్టుబడులు వెళ్లిన, బొప్పాయి, తోట నుంచి వచ్చిన ఆదాయం మిగులుతోందని కలిగిందని రైతులు అంటున్నారు.

ఎకరంలో బంతిపూల తోట సాగుచేశా



గ్రామంలో రెండు సంవత్సరాలుగా ఎకరం చేలో బొప్పాయి తోటలో అంతర సేద్యంగా బంతి తోట వేస్తున్నాను. దీంతో బంతి సాగు చేయడంతో ఎకరానికి 20 క్వింటాళ్లు వస్తుంది. కూలీల ఖర్చులు తక్కువ ఉండడంతో ఎకరానికి ఆదాయం రూ.80 వేల ఆదాయం వచ్చింది.

● గోళ్ళ రంగారెడ్డి, రైతు దొండపాడు.

నాగార్జునసాగర్ జలాల విషయంలో

సమన్వయం అవసరం

● సాగర్ కుడికాల్వ కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు



కాంతారావు

నార్కట్‌పల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు జలాల వాడకం విషయంలో తెలుగు రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని సాగర్ కుడికాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు అన్నారు. బుధవారం హైద్రాబాద్ నుంచి గుంటూరుకు వెళ్తున్న ఆయన మార్గమధ్యలో నార్కట్‌పల్లి లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల రైతులు కృష్ణాజలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వరదలు వచ్చిన సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు నాగార్జునసాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా ఆంధ్రా ప్రాంతానికి విడుదలయ్యే వరద జలాలను వాటా జలాలుగా లెక్కించే విధానం ఉండేది కాదన్నారు. కానీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత నాగార్జునసాగర్‌కు వరదలు వచ్చి దిగువకు విడుదల చేసే వరద జలాలను కూడా రాష్ట్ర వాటా జలాల కింద లెక్కిస్తున్నారని అన్నారు. ఇది సరైంది కాదని కాంతారావు అభిప్రాయపడ్డారు. ఈ కారణంగా ఏప్రి ల్ నెలాఖరున కుడికాల్వ కింద తమ రాష్ట్ర పరిధిలోని గ్రామాల రైతుల పంటల సాగుకు నీరందక నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణపై కృష్ణానది బోర్డు యాజమాన్యం (కేఆర్ఎంబీ) ఇంకా సమర్థంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 60 సంవత్సరాల క్రితం ని ర్మించిన ఈ ప్రాజెక్టు భద్రత, నిర్వహణపై కేఆర్ఎంబీ ప్రత్యేక దృష్టి సారించాలని కాంతారావు అన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు శివచరణ్



శివచరణ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని బకాల్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి శివచరణ్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల భువనగిరిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడంతో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అనంతరం శివచరణ్‌ను అభినందించారు. శివచరణ్ పదో తరగతి చదువుతున్నాడు. కార్యక్రమంలో పీడీ పంగ సైదులు, నామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు రావులపెంట వెంకటయ్య పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడాపోటీలు

నాగార్జునసాగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో మహాత్మా జ్యోతిబాఫూలే బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న బీసీ గురుకులాల జిల్లా స్థాయి క్రీడా పోటీలు బుధవారం రెండో రోజు హోరాహోరీగా కొనసాగాయి. సెమీ ఫైనల్స్‌లో ఖో-ఖో పోటీల్లో నార్కట్‌పల్లి-నాగార్జునసాగర్ జట్లు, కబడ్డీలో తిరుమలగిరి(సాగర్)-నాగార్జునసాగర్ జట్లు, వాలీబాల్‌లో రాజాపేట-నాగార్జునసాగర్ జట్లు తలపడినట్లు ప్రిన్సిపాల్ రవి కుమార్ తెలిపారు. అథ్లెటిక్స్ అండర్-19 పోటీల్లో 200 మీటర్ల పరుగుపందెంలో కె.అకాష్ (కోల్‌ముంతలపహాడ్) ప్రథమస్థానం, కె.శివ (పోచంపల్లి) ద్వితీయ స్థానం, 800 మీటర్ల పరుగు పందెంలో భాషంత్ (పోచంపల్లి) ప్రథమ స్థానం, బి. రవికుమార్ (పోచంపల్లి) ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. గురువారం(నేటి)తో పోటీలు ముగియనున్నట్లు ఆయన తెలిపారు.

నాణ్యమైన విత్తనాలే రైతులకు నిజమైన నేస్తాలు



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ అంజయ్య

నేరేడుగొమ్ము, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలే రైతులకు నిజమైన నేస్తాలు అని ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ అంజయ్య అన్నారు. నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా బుధవారం నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం కేతేపల్లి గ్రామంలో రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. రైతులు కేఎన్ఎం 1638 వరి సాగు చేయడంతో గతం కంటే అధిక దిగుబడిని ఇచ్చేలా పంట పండిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అంజయ్య మాట్లాడుతూ ఈ విత్తనాలను పక్క రైతులకు అందించి విత్తనోత్పత్తికి సహకరించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో వెంకటేష్, రాజు, రైతులురాములు, గుర్రం శ్రీను, నారాయణ, యాద అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మిథ్యగా మారిన వృత్తి విద్య

● కోర్సులు మంజూరు చేసి పోస్టులివ్వని ప్రభుత్వం
● రెండేళ్లు స్వచ్ఛందంగా బోధించిన వలంటీర్లు
● నష్టపోతున్న ఒకేషనల్ విద్యార్థులు
● నార్కట్‌పల్లి ప్రభుత్వ కళాశాలలో ఇదీ పరిస్థితి



నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

నార్కట్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో (జీజేసీ)లో వృత్తి విద్య మిథ్యగా మారింది. పాఠాలు బోధించే అధ్యాపకులు అర్ధాంతరంగా మానివేయడంతో బోధించే వారు లేక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు జూనియర్ కాలేజీలో రెగ్యులర్ కోర్సులైన ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలకు అధ్యాపకులను నియమించిన ప్రభుత్వం ఒకేషనల్ కోర్సులకు పోస్టులు మంజూరు చేయలేదు. పైగా ఒకేషనల్ విద్యార్థులకు ఇంతకాలం వలంటీర్లుగా విద్యను బోధించిన అధ్యాపకులు అర్ధాంతరంగా మానేయడంతో ఒకేషనల్ విద్యార్థుల చదువు త్రిశంకు స్వర్గంలా మారింది. అటు చదవలేక ఇంకో కాలేజీకి వెళ్లలేక విద్యార్థులు సతమతమవుతున్నారు. చివరకు కామర్స్ చెప్పే అధ్యాపకులే తప్పనిసరై ఎంఎల్‌టీ క్లాసులు చెబుతున్న వింత పరిస్థితి నెలకొంది.

కోర్సులే మంజూరు - పోస్టులు కాదు

నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ప్రభుత్వం 2023-24 విద్యా సంవత్సరానికి జూనియర్ కాలేజీని మంజూరు చేసింది. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులను మంజూరు చేసింది. అయితే అదే విద్యాసంవత్సరానికి నాంపల్లి మండల కేంద్రంలోని ఒకేషనల్ కాలేజీని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు నార్కట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి బదలాయించారు. ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులను బోధించేందుకు అనుమతిచ్చారు. దీంతో కాలేజీలో ప్రస్తుతం 70మంది విద్యార్థులు ఒకేషనల్ కోర్సుల్లో ఉన్నారు. అయితే కోర్సులైతే మంజూరు చేసిన ప్రభుత్వం అధ్యాపక పోస్టులను మాత్రం మంజూరు చేయలేదు.

రెండేళ్లు బోధించిన వలంటీర్లు

కాలేజీకి కోర్సుల నిర్వహణకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం, అధికారులు కనీసం కాంట్రాక్టు లెక్చరర్ పోస్టులనైనా మంజూరు చేయకపోతారా అనే విశ్వాసంతో నల్లగొండకు చెందిన సరస్వతి, యామిని అనే ఇద్దరు యువతులు ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులను బోధించేందుకు వలంటీర్‌గా ముందుకు వచ్చారు. సుమారు రెండేళ్లు ఎలాంటి వేతనం లేకుండానే స్వచ్ఛందంగా వృత్తి విద్య బోధన చేశారు. రెండేళ్లు గడిచినా ప్రభుత్వం కాలేజీకి వృత్తి విద్యా కోర్సుల బోధనకు పోస్టులను మంజూరు చేయకపోవడం, చేస్తారనే నమ్మకం కూడా లేకపోవడంతో సెప్టెంబరు నెల నుంచి అర్ధాంతరంగా మానేశారు. దీంతో కాలేజీలో చేరిన సుమారు 70 మంది వృత్తి విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇంటర్మీడియట్ కోర్సులను బోధించే కామర్స్ లెక్చరర్ ఇతర బైపీసీ సబ్జెక్టులు బోధించే వారితో అడపాదడపా క్లాసులను నడుపుతున్నారు.

మాకు నష్టం జరగకుండా చూడాలి



కాలేజీలో అధ్యాపకులు ఉన్నారనే నమ్మకంతో ఒకేషనల్ కోర్సులో చేరాం. మొదటి సంవత్సరం వరకు బోధించిన అధ్యాపకురాలు ఈ విద్యాసంవత్సరం ప్రా రంభమైన తర్వాత మధ్య లో మానేసింది. ప్రభుత్వం కోర్సులు మంజూరు చేసింది కానీ పోస్టులు మంజూరు చేయలేదంటూ కాలేజీ అధ్యాపకవర్గం చెబుతోంది. మాకు వృత్తి విద్యాభ్యాసం విషయంలో నష్టం జరగకుండా న్యాయం చేయాలి.
- కొండా సతీష్, ఎంఎల్‌టీ స్టూడెంట్, ద్వితీయ సంవత్సరం

వచ్చే విద్యాసంవత్సరం అడ్మిషన్లు తీసుకోం



నార్కట్‌పల్లి జీజేసీకి వృత్తి విద్యా బోధకుల పోస్టులను మంజూరు చేయాలని ఇప్పటికే పలు పర్యాయాలు డీఐవోతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్‌ను, ప్రత్యేకాధికారిని కోరాం. అయినా ఇప్పటికీ పోస్టులు మంజూరు కాలేదు. కనీసం ఈ విద్యా సంవత్సరం ఉన్న విద్యార్థులకైనా అన్యాయం జరగకుండా కాలేజీ లెక్చరర్‌ల ద్వారా బోధన చేయిస్తున్నాం. అధ్యాపక పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయకుంటే వచ్చే విద్యా సంవత్సరం నుంచి మా కాలేజీలో అడ్మిషన్లు ఆపేస్తాం.
- బాలాజీ, ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ), నార్కట్‌పల్లి

587.60 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌కు ఎగువనుంచి 34,468 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, 37,779 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు)కాగా బుధవారం సాయంత్రానికి 587.60 అడుగులుగా (305.8626టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 20,625క్యూసెక్కులు, కుడికాల్వ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 5,654 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థుల ఎంపిక

సంస్థాన్ నారాయణపురం నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. పదో తరగతికి చెందిన డి.శిరీష 100 మీటర్ల అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైంది.. 200 మీటర్ల అథ్లెటిక్స్ విభాగంలో నీళ్ల అమ్ములు ఎంపికైంది. ఇరువురు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఈ విద్యార్థినులు పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను, వ్యాయామ ఉపాధ్యాయురాలు కళావతిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేగట్టె రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ప్రాకార మండపంలో నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రాకార మండపంలో ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. గజవాహనంలో విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టి అంకార వెండిజోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.20,66,297 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. ఆధ్యాత్మికవాడల్లో 448 జంటలు సత్యదేవుని వ్రతాలు జరిపించగా అధిక సంఖ్యలో కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

స్వామిని దర్శించుకున్న స.హ.చట్టం కమిషనర్లు

స్వామివారిని సమాచార హక్కు చట్టం కమిషనర్లు పీ.వీ.శ్రీనివాస్, భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డి దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు దేవస్థాన అతిథిగృహం చేరుకున్న కమిషనర్లకు కలెక్టర్ ఎం.హనుమంతరావు అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డితో కలిసి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. తూర్పురాజగోపురం ద్వార ఆలయ ప్రవేశించిన కమిషనర్లు ముందుగా క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామిని దర్శించుకోగా ప్రధానార్చక భట్టర్ సురేంద్రాచార్యులు బృందం పూలమాలతో స్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి మొక్కులు తీర్చుకొని గర్భాల యంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు.

దేవాదాయ శాఖకు స.హ.చట్టం వర్తిస్తుంది

ప్రభుత్వం ద్వారా వినియోగం అవుతోన్న స.హ.చట్టం దేవాదాయ శాఖకు వర్తిస్తుందని ఆర్టీఐ కమిషనర్లు పీ.వీ.శ్రీనివాసరావు, బోరెడ్డి ఆయోధ్యరెడ్డి, దేశాల భూపాల్ అన్నారు. యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్న అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో వెలువడిన తీర్పులనే ఆలయాల్లో అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఆదేశాలు అమలు చేయకుండా ఇటీవల సుప్రీం కోర్టు మార్గదర్శకాలను దేవాదాయశాఖ అమలు చేయాలన్నారు. స.హ. చట్టం అమలులో టీటీడీకి కూడా మినహాయింపు లేదని కోర్టు వెల్లడించినట్లు వివరించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కూడా దేవాదాయ శాఖకు స.హ. చట్టం వర్తిస్తుందన్నారు. గతంలోని తీర్పును అధికారులు అమలు చేయలేదని, అది చట్టానికి వాస్తవ విరుద్ధమని వారు పేర్కొన్నారు.



స.హచట్టం కమిషనర్లకు ఆశీర్వచనం చేస్తున్న ప్రధానార్చకుడు సురేంద్రాచార్యులు

లాంచీ ప్రయాణికులకు సౌకర్యవంతంగా..

● రూ.4 కోట్ల ఐడబ్ల్యూఏఐ నిధులతో సాగర్‌లో పంటు తయారీ
● రెండు సాగర్‌కు, ఒకటి సోమశిల బోటింగ్ పాయింట్‌కు



హిల్‌కాలనీ లాంచీ స్టేషన్ వద్ద తయారు చేస్తున్న పంటు

నాగార్జునసాగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌లో పర్యాటకపరంగా సౌకర్యాలు మరింతగా మెరుగుపడనున్నాయి. సాగర్ హిల్‌కాలనీలో ఉన్న పర్యాటక శాఖ లాంచీ స్టేషన్‌కు కొత్త పంటులు(లాంచీ ఎక్కేందుకు పక్కన నిలిపి ఉంచే ఏర్పాట్లు) రానున్నాయి. దీంతో పర్యాటకులకు లాంచీలు ఎక్కడానికి, జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండ వద్ద లాంచీలు దిగడానికి పర్యాటకులకు మరింత సౌకర్యం కలుగనుంది. ఇప్పటికే సాగర్ లాంచీస్టేషన్‌లో మూడు పంట్లు ఉండగా, ఒక్కొక్కటి 18అడుగుల పొడవు ఉంది. కొత్తగా తయారుచేస్తున్న పంట్లు 24అడుగుల పొడవుతో రూపొందిస్తున్నారు. సాగర్ లాంచీస్టేషన్ వద్ద ప్రస్తుతం మూడు పంటులను తయారు చేస్తుండగా, రెండు సాగర్ బోటింగ్‌కు, మరొకటి సోమశిల బోటింగ్ పాయింట్‌కు కేటాయించినట్లు పర్యాటక శాఖ అధికారులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐడబ్ల్యూఏఐ(ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా) రూ.4కోట్లతో వీటిని తయారుచేస్తోందని అధికారులు వెల్లడించారు. కోల్‌కత్తాకు చెందిన బ్లూ వేల్ షిపింగ్ సంస్థ ఈ పనులు చేపట్టగా, మూడు నెలల్లో పూర్తి చేసి పర్యాటక శాఖకు అందజేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

ఐడబ్ల్యూఏఐ పనితీరు ఇలా..

కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఇన్‌లాండ్ వాటర్‌వేవ్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) 1986లో ఏర్పాటైంది. లోతట్టు జలమార్గాలపై షిప్పింగ్, నావిగేషన్‌ను ప్రోత్సహించడం ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం. ఈ సంస్థ అంతర్గత జలమార్గాలకు మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెడుతుంది.

చెర్వుగట్టులో ఆలయశుద్ధికి శ్రీకారం

● ప్రతీ గురువారం ఇక స్వచ్ఛతా కార్యక్రమం



చెత్త తొలగింపును పర్యవేక్షిస్తున్న ఈవో మోహన్‌బాబు

నార్కట్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మనగుడి- స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ఇక ప్రతీ గురువారం దేవస్థానంలో ఆలయ శుద్ధికి శ్రీకారం చుడుతున్నామని మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం ముఖ్య కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్‌బాబు అన్నారు. బుధవారం దేవస్థాన సిబ్బందితో మన గుడి-స్వచ్ఛత పరిశుభ్రత అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుట్టపైన, గుట్ట కింద అపరిశుభ్రంగా ఉన్న పరిసరాల్లోని వ్యర్థ పదార్థాలను శుభ్రపర్చారు. పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. దుర్వాసన రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయాన్ని పరిశుభ్రంగా మార్చేందుకు దేవస్థానం సిబ్బందికి భక్తులు సహకరించాలని ఈవో కోరారు. ప్రతీ గురువారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి పర్యవేక్షిస్తారని చెప్పారు.

ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

● విధుల పట్ల నిర్లక్ష్యం చేసినందుకు చర్యలు

మర్రిగూడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కూలీల జాబ్ కార్డులో ఈకేవైసీ ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయకుండా నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో మున్నయ్య తెలిపిన ప్రకారం ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లు శివన్నగూడ పుష్పలత, రామ్ రెడ్డిపల్లి యాదయ్యచారి, అజిలాపురం నరసింహులు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు ఈకేవైసీ యాప్‌లో కూలీల జాబ్‌కార్డులు ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయకపోవడం, విధుల పట్ల నిర్లక్ష్యం వహించినట్లు ఆయన తెలిపారు. కూలీలకు సంబంధించిన వివరాలను అక్టోబరు 23 వరకు కేవలం 16శాతం మాత్రమే ఆన్‌లైన్‌లో అతి తక్కువ నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం మర్రిగూడ మండలంలోని సస్పెండ్ నోటీసు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు జారీ చేసిన సస్పెండ్ నోటీస్ డీఆర్‌డీఏ ఆఫీసుకు వచ్చి సమాధానం చెప్పాలని జారీ చేసిన నోటీసులో వెల్లడించినట్లు ఎంపీడీవో తెలిపారు.

కృష్ణా జలాలు అందాయా.. ఆలోచించండి

● సమస్యలు తెలుసుకోవడానికే జాగృతి జనం బాట
● జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో పరిస్థితులు దయనీయం
● తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత

నల్లగొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ తెచ్చుకున్నామని, తెలంగాణ వచ్చాక మనం నీళ్లు మనకు వస్తాయని అనుకున్నామని, అయితే జిల్లాకు కృష్ణా నీళ్లు పూర్తి స్థాయిలో వచ్చాయో లేదో అందరూ ఆలోచించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో వివిధ వర్గాల ప్రజలతో సమావేశం నిర్వహించి జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సాగర్ డ్యాం ఇక్కడే ఉన్నా చుట్టూ ఉన్న 5 మండలాలకు నీళ్లు రావన్నారు. బీఆర్ఎస్‌ను ఇదే విషయంలో విమర్శించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఎందుకు పనులు చేపట్టడం లేదని ఆమె ప్రశ్నించారు.

నల్లగొండ చరిత్ర కలిగిన ప్రాంతం

నల్లగొండ జిల్లా అంటేనే ఎంతో చరిత్ర కలిగిన ప్రాంతమని, రాజ్యాలు, ప్రజా ఉద్యమాలు, ఆలోచనలు ఉన్న జిల్లా అని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒకప్పుడు బౌద్ధం, జైనంతో పాటు అ ద్భుతమైన ఆలోచన సరళి కలిగి ఉందన్నారు. జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణ చరిత్రను కాపాడుకునే ప్రయత్నం జరుగుతుందన్నారు. పచ్చల, ఛాయ సోమేశ్వరాలయాలు ఉన్నాయని, మరో పక్క సాయుధ రైతాంగం పోరాటం జరిగిందన్నారు. సాయుధ రైతాంగ పోరాటం చేయని ఇళ్లు లేదని, జిల్లాలో ఇప్పటికి కూడా అదే చైతన్యం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రతీ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలు తిరిగానని గుర్తుచేశారు. ప్రతీ మండల కేంద్రంలో బతుకమ్మను ఎత్తుకొని తిరిగానని, అలాంటి ఈ జిల్లాకు ప్రస్తుతం జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా వచ్చానని చెప్పారు. అనంతరం జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కోరారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించిన సందర్భంగా రోగులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మెటర్నరీ వార్డులో ఒక్కొక్క బెడ్ మీద ఇద్దరు పేషెంట్లను పడుకోబెట్టారని, సౌకర్యాలు లేకపోయిన పనిచేస్తున్న డాక్టర్లు, నర్సులకు చేతులెత్తి నమస్కరిస్తున్నానన్నారు. ఆస్పత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ, వాచ్‌మన్, దోబీలు, పేషెంట్ కేర్ సిబ్బంది ఇబ్బందులో ఉన్నారని వారికి నెలకు రూ.16వేలు రావాల్సి ఉండగా ఏజెన్సీలు కోత పెట్టి రూ.11వేలు ఇస్తున్నారన్నారు. జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీసం 1లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయలేదని, బోనస్ తప్పించుకునేందుకు రైతుల నుంచి ధాన్యం కొనడం లేదని ఆరోపించారు. తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నల్లగొండలో కనీసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డి తక్షణమే అండర్ గ్రౌండ్ డ్రైనేజీపై దృష్టి సారించాలని కోరారు.

ఫ్లెక్సీలు చించడం ఎంత వరకు సమంజసం

జాగృతి కార్యకర్తలు జిల్లా కేంద్రంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే వాటిని చించివేయడంతో పాటు తొలగించి ఫ్లెక్సీలు పెట్టిన వారిని అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. మంత్రి వెంకట్‌రెడ్డితో తనకు ఎలాంటి పంచాయితీ లేదని పోలీసులకు చెప్పి తమ కార్యకర్తలను వదిలివేయించాలని కోరారు. తాను రాజకీయాలు చేయాలని రాలేదని, రాజకీయాలు చేసే సమయం వస్తే ఖచ్చితంగా రాజకీయాలు చేయడంతో పాటు జిల్లాలో గట్టి పోటీదారులను నిలబెడతానని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఆమె వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కనగల్: కనగల్ మండలం దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని ఎమ్మెల్సీ కవిత దర్శించుకున్నారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. అర్చకులు కవితకు వేదఆశీర్వాదాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

నార్కట్‌పల్లి: 'నేస్తం' స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కార్యక్రమాలు, అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. నార్కట్‌పల్లిలోని నేస్తం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు టీజీ లింగంగౌడ్ నివాసానికి ఆమె వచ్చారు. సంస్థ ద్వారా చేసిన సేవా కార్యక్రమాల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆమె ఆసక్తిగా తిలకించారు.

అంతర్జాతీయ సమావేశానికి జిల్లా యంత్రాంగానికి ఆహ్వానం

నల్లగొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో నిర్వహించే సైన్స్ అండ్ టెక్నాలజీ అంతర్జాతీయ సమావేశంలో పాల్గొనేందుకు జిల్లా యంత్రాంగానికి ఆహ్వానం అందింది. ఈ మేరకు బుధవారం కేంద్ర ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఈమెయిల్ ద్వారా ఆహ్వానం పంపారు. డిసెంబరు 4వ, 5వ తేదీల్లో అంతర్జాతీయ సమావేశం నిర్వహించనున్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీని సామాజిక సేవ పరిష్కారంలో ఉపయోగించడం క్లస్టర్ల ద్వారా అభివృద్ధి చేసిన విజయవంతమైన నమునాలు ప్రదర్శిస్తారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో వివిధ దేశాలకు చెందిన ప్రభుత్వాధికారులు, అకాడమిక్‌లు, పరిశ్రమల నిపుణులు పాల్గొననున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి : మంత్రి వెంకట్‌రెడ్డి



కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని చర్లపల్లిలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ధాన్యం తేమశాతాన్ని, కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, హమాలీలతో మాట్లాడారు. తుఫాన్ కారణంగా ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమయ్యాయయని, అందువల్ల రైతులు తొందరపడి దళారులకు అమ్మి నష్టపోవద్దని అన్నారు. ప్రతీరోజు 10000 మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అయినా ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేసేందుకు కలెక్టర్, అధికారులతో సమీక్షించి ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలని విజ్ఞప్తి చేశారు. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు కాల్వలు పూర్తయితే నల్లగొండ నియోజకవర్గంలోని చర్లపల్లి, మర్రిగూడెం, అన్నెపర్తి, కంచనపల్లి చెరువులను నింపుతామని, తద్వారా భూగర్భజలాలు పెరగడమే కాకుండా, చుట్టుపక్కల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని అన్నారు. ఇందుకు సంబంధించి భూసేకరణకు రూ.17 కోట్ల రూపాయలు అందుబాటులో ఉన్నాయని, సాధ్యమైనంత త్వరగా దీనిని పూర్తిచేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తయితే పంటలకు సాగునీరు అందుతుందని, ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని, భూగర్భజలాలు పెరుగుతాయని తెలిపారు. ఆయన వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ, డీఎస్‌వో వెంకటేష్, జిల్లా సహకార అధికారి ప త్యానాయక్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి

నల్లగొండ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాల వేడుకల విద్యా సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యారంగం బలోపేతం కోసం విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో పాఠశాల అభివృద్ధితో పాటు ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మదుసూదన్‌రెడ్డి, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మనగోటి జనార్ధన్, తరాల పరమేష్‌యాదవ్, మల్లయ్య, సైదులు, మోహన్‌రెడ్డి, జలేందర్‌రెడ్డి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలో సమస్యలను పరిష్కరించాలి

నల్లగొండ: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ యూనివర్సిటీశాఖ ఆధ్వర్యంలో మంత్రి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయకపోవడంతో విద్యార్థులపై ఫీజుల భారం పడుతుందన్నారు. నూతన కోర్సులు ప్రవేశపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీశాఖ అధ్యక్షుడు హనుమాన్, మోహన్, మౌనేష్, విజయ్, సూర్య, సంపత్, నర్సింహ, సుధీర్, సతీష్, అజయ్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



నల్లగొండలో కరపత్రం విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

నల్లగొండ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిప్పర్తి మండల కేంద్రంలో ఈ నెల 20, 21వ తేదీల్లో నిర్వహించనున్న భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) 17వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీవైఎఫ్ఐ దేశభక్తి భావాలతో దేశ సమైక్యత సమగ్రత కోసం పాటుపడుతోందన్నారు. 'మా దేహం ముక్కలైనా దేశాన్ని ముక్కలు కానివ్వం' అంటూ 46 ఏళ్లుగా దేశ రక్షణకోసం డీవైఎఫ్ఐ అనేక త్యాగాలు చేసిందన్నారు. అలాంటి దేశభక్తి గల డీవైఎఫ్ఐ 17వ నల్లగొండ జిల్లా మహాసభలు అత్యంత ఉత్సాహభరితమైన వాతావరణంలో నవంబర్ 20, 21 తేదీల్లో తిప్పర్తి మండల కేంద్రంలో దాదాపు 400 మంది ప్రతినిధులతో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో భవిష్యత్తు కర్తవ్యాలను చర్చించి పోరాటాలకు రూపకల్పన చేయనున్నామని, ఈ మహాసభలకు యువతీ యువకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి నాయకులు బూర్గు గోపికృష్ణ, గంజి రాజేష్, నాగయ్య, యాదగిరి, సాయి పాల్గొన్నారు.

గోపలాయపల్లిలో వేద ఆశీర్వచనానికి శ్రీకారం

నార్కట్‌పల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): హరిహరక్షేత్రంగా బాసిల్లుతున్న నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో వేదపండితులతో వేదాశీర్వచన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రూ.516లు టికెట్ కొనుక్కుని ఒక టికెట్‌పై ఐదుగురు భక్తులకు వేదపండితులచేత వేదాశీర్వచనం చేయిస్తామని, ఈ నిధులను వేదపాఠశాల అభివృద్ధికి కేటాయిస్తామన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ కోర్టు ప్రాంగణంలో కేసుల పరిష్కారంకోసం ప్రత్యేక లోక్‌అదాలత్‌ను ఈనెల 15వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ డి.సైదులు తెలిపారు. చెక్ బౌన్స్, కుటుంబ తగాదాలు, మోటార్ వాహనాల యాక్సిడెంట్, భూ వివాద, బ్యాంకు తదితర పెండింగ్ కేసులు రాజీ చేసుకోదగిన అన్ని క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. లోక్‌అదాలత్ ద్వారా సత్వర పరిష్కారంఅప్పీలు లేని తీర్పును పొంది సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చునని ఎస్ఐ సైదులు తెలిపారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి

నల్లగొండరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే వెంటనే అమలుచేయాలని తెలంగాణ ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు సీహెచ్.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వీవోఏలకు కనీస వేతనం రూ.18వేల అమలుచేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లవుతున్నా ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డికి అందజేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ దుర్గయ్య, ఏ వెంకన్న, అనిమల్ల శేఖర్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లో ఈ నిరీక్షణ

(5వ పేజీ తరువాయి)

తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదనేది స్పష్టమవుతుంది.

జిల్లాకు రూ.2.48కోట్ల నిధులు విడుదల

రాష్ట్ర ప్రభుత్వం బిందు సేద్య పథకం అమలుకోసం జిల్లాకు రూ.2.48కోట్లను కేటాయించినట్లు సమాచారం. నిధులు విడుదలైనా అధికారులు మాత్రం రైతులకు సకాలంలో డ్రిప్ మంజూరు చేయకపోవడంతో పండ్లతోటల విస్తీర్ణంతోపాటు కూరగాయల సాగు ముందుకు సాగడంలేదు. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం కూరగాయల సాగును, పండ్లతోట విస్తీర్ణాన్ని పెద్దఎత్తున చేపట్టాలని యోచిస్తున్నా అందుకనుగుణంగా జిల్లాలో ప్రణాళికబద్ధంగా పనులు సాగడం లేదనేది స్పష్టమవుతుంది. ఒకేసారి రూ.2.48కోట్లతో లబ్ధిదారులను ఎంపికచేసి డ్రిప్ మంజూరు చేయాలనే ఆలోచన కాకుండా మూడు విడతలుగా ఈ నిధులను ఖర్చు చేయాలని అధికారులు యోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పథకం అమలును వేగవంతం చేయాల్సిన అధికారులు ఆ ప్రక్రియను నత్తనడకన సాగేలా చూడటంతోపాటు ఇంతవరకు ఆ వైపు ఒక అడుగు కూడా ముందుకు వేయకపోవడంతో రైతులకు అసలు ఎప్పటికి డ్రిప్ పరికరాలు అందుతాయనే దానిపై అయోమయం నెలకొంది. జిల్లాలో ఇప్పటికే తోటలు, కూరగాయల సాగు చేయాలన్న రైతులకు అధికారుల నిర్లక్ష్యంవల్ల డ్రిప్ అందకపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. జీఎస్టీ తగ్గిన తర్వాత మరింత వేగంగా సేవలు అందించాల్సిన అధికారులు నాన్చుడి ధోరణి అవలంబిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా అధికారులు పథకం ప్రారంభించడంతోపాటు డ్రిప్ పరికరాల సామగ్రి విషయంలోనూ నాణ్యతను పరిశీలించి అందుకు సంబంధించిన కంపెనీలను ఎంపిక చేయాల్సి ఉంది. రైతులనే స్వయంగా వారికి నచ్చిన కంపెనీలను ఎంపిక చేసుకుని డ్రిప్‌ను పొందేలా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది.

జలసంరక్షణలో జిల్లాకు కేంద్ర పురస్కారం

(5వ పేజీ తరువాయి)

కేంద్ర జలశక్తిశాఖ వెబ్‌సైట్‌లో ఫొటోలతో వివరాలను పొందుపరిచారు. 1 సెప్టెంబరు 2024 నుంచి 31 మే 2025 వరకు చేపట్టిన పనుల ఆధారంగా పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ పనులను పరిశీలించే నిమిత్తం జి ల్లాలో కేంద్రజలశక్తి శాఖ అధికారుల బృందం జూన్ 19 నుంచి జులై 15వరకు రెండు బృందాలుగా ఏర్పడి పనులను పరిశీలించారు. మొత్తం 849 పనులను ఈ బృందాలు ర్యాండమ్‌గా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు, కేంద్రానికి నివేదించడంతో పురస్కారానికి లైన్‌క్లియర్ అయింది.

సంతోషంగా ఉంది : డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి

జిల్లాలో చేపట్టిన జలసంచయ్, జన్‌భాగీదరి కార్యక్రమం చేపట్టిన పనులకు కేంద్ర జలశక్తి శాఖ పురస్కారం ప్రకటించడం సంతోషంగా ఉంది. కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచనలతో మేం ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో ఈ పనులు చేపట్టి సకాలంలో పూర్తిచేశాం. నీటివనరుల కొరత ఉన్న ప్రాంతాల్లో వర్షపునీటిని సంరక్షించడంతో పాటుగా, భూగర్భజలాలు పెంచడమే కేంద్రంగా ఈ పనులు గుర్తించి నిర్వహించాం. కలెక్టర్ ప్రోత్సాహం, రైతులు, గ్రామస్థుల సహకారంతో పాటుగా గ్రామీణాభివృద్ధిశాఖ అవిరళ కృషికి దక్కిన గౌరవంగా ఈ పురస్కారాన్ని భావిస్తున్నాం. జిల్లాలో మరిన్ని ఉపయుక్తకరమైన కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ పురస్కారం స్ఫూర్తినిస్తుంది.

ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలుచేయాలి

కేతేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని జిల్లా ఆడిట్ అధికారి, కేతేపల్లి మండల ప్రత్యేకాధికారి బి.శ్రీనివాస్ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బందితో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధి హామీ పనులు, విద్య, వైద్య, వ్యవసాయశాఖల పనితీరును సమీక్షించారు. మండల వ్యాప్తంగా వానాకాలం ధాన్యం కొనుగోళ్ల ఎలా సాగుతున్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు నిత్యం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామ పంచాయితీల ప్రత్యేక అధికారులు ఆయా గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులను పరిశీలించాలన్నారు. అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఏవో బి.పురుషోత్తం, ఈజీఎస్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్

ఏపీవో రమణయ్య, ఎంఈవో ఎ.రాజేంద్రప్రసాద్, మండల వైద్యాధికారి కె.అర్చన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం



కొరటికల్‌లో రైతులకు పామాయిల్‌పై అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

మునుగోడు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొంద వచ్చని కొరటికల్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారి వెంకటేష్, పతంజలి ప్లాంటేషన్ ఆఫీసర్ బానుచందర్ సూచించారు. మండలంలోని కొరటికల్ రైతు వేదికలో బుధవారం ఆయిల్‌పామ్ సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడా రు. ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతులకు ప్రభుత్వం తరఫున సబ్సిడీ అందజేస్తున్నట్లు చెప్పారు. డ్రిప్ పరికరాలు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీ రైతులకు 90శాతం, ఓసీ రైతులకు 80శాతం రాయితీ వస్తుంది. రైతులు ఆయిల్ పామ్ పంట వేసిన తరువాత అంతర పంటల సాగు, ఎ రువుల నిమిత్తం ఎకరాకు రూ. 4,200 నాలుగేళ్ల పాటు అందజేయనున్నట్లు వివరించారు. ఒక్కసారి నాటితే పంట దిగుబడి 4వ సంవత్సరం నుంచి మొదలై 30 ఏళ్ల పాటు ప్రతినెలా ఆదాయం వచ్చే ఏకైక పంట ఆయిల్ పామ్ అన్నారు. రూ.200 విలువ గల మొక్కలను కేవలం రూ.20లకే ఒక్కో ఆయిల్‌పామ్ మొక్కను రైతులకు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో బై బ్యాక్ అగ్రిమెంట్ కూడా ఉంటుదని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వచ్చి ఆయిల్ పామ్ పంటను వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కుతాటి లక్ష్మయ్య, మానిటరింగ్ అధికారి రేణుక, సీఈవో సుఖేందర్, స్వామి పాల్గొన్నారు.

అంతర్ పంటలు చేసుకోవచ్చు

శాలిగౌరారం: ఆయిల్‌పామ్ సాగులో సీనియర్ ప్లాంటేషన్ ఆఫీసర్ నరేందర్ అన్నారు. శాలిగౌరారం వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఆకారంలో నిర్వహించిన ఆయిల్ పామ్ సాగు అవగాహన సదస్సులో సీనియర్ ప్లాంటేషన్ ఆఫీసర్ నరేందర్ పాల్గొని మాట్లాడారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం కలిపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో సీఈవో నిమ్మల ఆంజనేయులు, ఫీల్డ్ ఆఫీసర్ కట్టంగూరి శ్రీనివాస్, మాజీ మార్కెట్ డైరెక్టర్ వలిశెట్టి యాదయ్య ఉన్నారు.

కంప్యూటర్ల బహూకరణ

నార్కట్‌పల్లి, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి లయన్స్ క్లబ్ సభ్యుడు అద్దంకి కృష్ణమాచారి సుమారు రూ.40వేల విలువైన 4 కంప్యూటర్‌లను బుధవారం బహూకరించారు. వీటిని లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఛాలెంజ్ తరఫున లయన్స్ క్లబ్ గవర్నర్ రేపాల మదన్ మోహన్ అందజేశారు. ఈ సందర్భంగా సైట్ ఫర్ కిడ్స్ పేరిట క్లబ్ సౌజన్యంతో పాఠశాల విద్యార్థులకు డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఉచిత కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రేపాల మదన్ మోహన్, అలుగుబెల్లి పాపిరెడ్డి, మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, అద్దంకి కృష్ణమాచారి, పాఠశాల హెచ్ఎం డీ.రాములు, రాధారపు బిక్షపతి, కృష్ణారెడ్డి, వైద్యులు ప్రభోద్, పవన్, వీ.శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మునుగోడురూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమస్థాన్‌పల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమై సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ చెక్క లింగరాజు, లక్ష్మి దంపతుల కుటుంబానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని పంపించారు. బుధవారం ఆ నగదును కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు బాధిత కుటుంబానికి అందజేశారు. ఇంట్లో సామగ్రి అగ్నికి ఆహుతై రోడ్డున పడిన బాధిత కుటుంబానికి డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఆర్థికసాయం అందజేయడంపై గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ప్రతిజ్ఞ చేస్తున్న ఎల్లారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

చండూరు రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ అన్నారు. బేటీ బచావో బే టీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని బంగారిగడ్డ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో శిశు విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అది చట్టవిరుద్ధమని అన్నారు. పాఠశాల విద్యార్థులకు బాల్య వివాహాలు, శిశు విక్రయాలు, భ్రూణ హత్యల పై వారికి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు రెండవ, మూడవ సంతానంలో ఆడపిల్లలు జన్మించిన ఇళ్లను సందర్శించి వారికి తగు సూచనలు చేయాలని సూచించారు. ముఖ్యంగా మైనర్ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలపై అవగాహన కల్పిస్తూ, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అశ్రిత ఎన్జీవో ధనమ్మ , ప్రధానోపాధ్యాయురాలు వెలంగిని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


గుడ్ టచ్....బ్యాడ్ టచ్‌పై అవగాహన

నార్కట్‌పల్లి : మండలంలోని నార్కట్‌పల్లి, ఎల్లారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు గుడ్ టచ్...బ్యాడ్ టచ్‌లపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, డయల్ 1098 నెంబర్ అవసరం, పోషకాహారం, మాదక ద్రవ్యాల వాడకం, సామాజిక మాధ్యమాల్లో పరిచయం లేని వ్యక్తులతో చాటింగ్ చేయడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు డీ.రాములు, హిమజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత, ఆశ్రీత, ఝాన్సీ అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, విజయ, ఉమ తదితరులు ఉన్నారు.

తిరుమలనాథస్వామి ఆలయ భూముల సర్వే

చిట్యాలరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకాపర్తి తిరుమల నాథస్వామి ఆలయ భూములను బుధవారం సంబంధితశాఖ అధికారులు పరిశీలించారు. సర్వేనంబరు 201లో సుమారు 102 ఎకరాల భూమి అన్యాక్రాంతమవుతుందని గ్రామస్థులు పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో నల్లగొండ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి పవన్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు ఆ భూములను పరిశీలించారు. హద్దులను నిర్ణయించి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని సర్వే అధికారులు తెలిపారు. ఆలయ భూములు కబ్జాకు గురయ్యాయని కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను గ్రామస్తులు కోరారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వెంట మండల సర్వేయర్ రజనీకాంత్, ఆలయ అధికారులు బి. సుమతి, నాగిరెడ్డి, గ్రామస్తులు చేకూరి గణేష్, పొట్లపల్లి చిన్నస్వామి, పొట్లపల్లి సుభాష్, పొట్లపల్లి నర్సింహ, పొట్లపల్లి యాదయ్య, మాచర్ల యాదగిరి, పున్న విష్ణు తదితరులు ఉన్నారు.

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ సంఘం అధ్యక్షుడిగా అంజిరెడ్డి



చాపల అంజిరెడ్డి

నకిరేకల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ నకిరేకల్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా యానాల యానాల కృష్ణారెడ్డి, అధ్యక్షుడు చాపల అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పట్టేటి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు జిల్లా బృగు మహర్షి, రావిరాల జగన్, గింజల ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి థామస్‌రెడ్డి, కార్యదర్శులు భద్రయ్య, లింగారెడ్డి, కంచరకుంట్ల అరుణశ్రీ, కార్యవర్గ సభ్యులు పెరిక సైదులు, భీమిరెడ్డి నర్సింహ్మారెడ్డి, జేరిపోతుల మల్లయ్య, పైళ్ల లింగయ్య, మహ్మద్ యూసుఫ్, అలీ, పుణ్యమూర్తి లింగయ్య, ముఖ్య సలహాదారులు బి.ప్రకాష్‌రావు, బత్తుల సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, యానాల కృష్ణారెడ్డి, నూకల జగదీష్‌చంద్ర, శ్యామ్‌సుందర్, కుకుడాల గోవర్ధన్ పాల్గొన్నారు.

కవితల్లో జీవించిన మండల స్వామి

● డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి

చిట్యాలరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాను రచించిన 'కలల సందుక' కవిత్వాల్లో కవి మండల స్వామి జీవించి ఉన్నారని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. చిట్యాల మండలం పిట్టంపల్లికి చెందిన దివంగత కవి, డాక్టర్ మండల స్వామి రచించిన కలల సందుక సంపుటీని బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రచయితగా, కవిగా, కథకుడిగా పరిశోధకుడిగా బహుముఖినమైన మండల స్వామి రచనలు అద్భుతమని బలమైన అభివ్యక్తి చక్కని శిల్పంతో సమసమాజాన్ని కాంక్షిస్తూ తన కవిత్వాల్లో జీవించారని కొనియాడారు. వృత్తిదారుల జీవితాలను సాహిత్యంలో నిలిపారని గురువులు గర్వించే స్థాయికి ఎదిగారని అకాల మరణం తీరని లోటన్నారు. కార్యక్రమంలో తెలుగు సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఎన్. బాలశౌరి, డాక్టర్ నాగేశ్వర శంకరం, మోత్కూరి నరహరి, పెరుమాళ్ల ఆనంద్, తండు కృష్ణకౌండిన్య, వేముగంటి మురళీకృష్ణ, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, డాక్టర్ ఉప్పల పద్మ, డాక్టర్ కనకటి రామకృష్ణ, గడ్డం శ్రీను, బండారు శంకర్, కొండేటి ప్రకాష్ పాల్గొన్నారు.



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి

నేడు బీసీ ధర్మపోరాట దీక్ష

నల్లగొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 42శాతం రిజర్వేషన్ సాధన కోసం ఈనెల 13వ తేదీన జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో బీసీల ధర్మ పోరాట దీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ చక్రహరి రామరాజు తెలిపారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ దీక్షకు బీసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి పాల్గొనాలని కోరారు. అనంతరం బీసీ జేఏసీ కార్యవర్గాన్ని విస్తరించిన సందర్భంగా కమిటీలోని సభ్యులను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ కోఆర్డినేటర్ నేలపట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

నార్కట్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పట్టణ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొత్తగా వేయనున్న విద్యుత్ స్తంభాల తీగలను మార్చడం కోసం ఈ నెల 13న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తహసీల్దార్‌గా రమాకాంత్



రమాకాంత్

చండూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చండూరు తహసీల్దార్‌గా కె.రమాకాంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చింతపల్లి త హసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. చండూరు కార్యాలయంలో డీటీగా ఉన్న చంద్రశేఖర్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్నారు. బాధ్యతలు స్వీకరించిన రమాకాంత్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలను అందేలా తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. అనంతరం కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలపై ఆయన అధికారులతో సమావేశమై ఆరా తీశారు. సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, ఆర్ఐ మురళీకృష్ణ, లింగస్వామి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

వసతిగృహ సంక్షేమ అధికారుల సంఘం కార్యదర్శిగా శంకర్‌రెడ్డి



రమాకాంత్

కట్టంగూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం కార్యదర్శిగా కట్టంగూరు ఎస్సీ హాస్టల్ వార్డెన్ గుజ్జుల శంకర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. బుధవారం నల్లగొండ టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన నల్లగొండ రెవిన్యూ డివిజన్ స్థాయి వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం ఎన్నికల్లో శంకర్ రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మండల ప్రత్యేకాధికారిగా శ్రీనివాస్


కేతేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆడిట్ అధికారి బి.శ్రీనివాస్ బుధవారం కేతేపల్లి మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ప్రత్యేకాధికారిగా ఉన్న జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ జె. హరీష్ స్థానంలో ఈయన నూతనంగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం కేతేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బంది ప్రత్యేకాధికారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కట్టంగూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వం నిర్వహించే వైద్య శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి జి.సతీష్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్యాలమ్మగూడెం జీపీ పరిధి చిన్నపురి గ్రామంలో మహాత్మా జ్యోతిరావుపూలే పాఠశాలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావుతో కలిసి పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని పాఠశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి శ్వేత విద్యార్థులను పరీక్షించారు. పీహెచ్ సిబ్బంది విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, ఎంపీవో స్వరూపరాణి, సీహెచ్‌వో నర్సింహారావు, వైద్య, ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజానాట్య మండలి అధ్యక్షుడిగా రాంబాబు

మర్రిగూడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజానాట్య మండలి మర్రిగూడెం మండల నూతన కమిటీని సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గడ్డం రాంబాబు, ప్రధానకార్యదర్శి ఏర్పుల ఎల్లయ్య, ఉపాధ్యక్షులు బరిగల కృష్ణ, గుమ్మని మంగమ్మ, సహాయ కార్యదర్శులు రజిత, దామర శివ, కోశాధికారిగా ఏర్పుల కవిత మరో ఆరుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.60 (305.8626)	34,468	37,779
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.30 (4.28)	1566.19	2,493.07
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.587 (43.5968)	35,233	65,064

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

జలసంరక్షణలో జిల్లాకు కేంద్ర పురస్కారం



నల్లగొండ మండలం కేశరాజుపల్లి వద్ద నిర్మించిన కృత్రిమచెరువు

- రూ.2కోట్ల నగదు, అవార్డు ప్రకటించిన కేంద్ర జలశక్తి శాఖ
- జల్ సంచయ్, జన్‌భాగీధారి కార్యక్రమ అమలులో దక్షిణభారత దేశంలో ఉత్తమ పనితీరు

వర్షపు నీటి సంరక్షణ, భూగర్భజలాల పెంపు చర్యలు అమలు చేయడంలో ఉత్తమ పనితీరుకు గాను జిల్లాకు జాతీయస్థాయిలో అత్యున్నత పురస్కారం దక్కింది. కేంద్ర జలశక్తి శాఖ అమలు చేస్తోన్న 'జల్ సంచయ్, జన్ భాగీధారి' కార్యక్రమం కింద చేపట్టిన పనులకు జిల్లాకు ఈ గుర్తింపు లభించింది.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి- నల్లగొండ)

దేశంలో దక్షిణాది విభాగంలో మొదటి కేటగిరీ కింద ఎంపికచేసిన మూడు జిల్లాల్లో నల్లగొండతో పాటుగా ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలకు చోటు దక్కింది. జిల్లాలో చెరువుల, పాతబావుల పునరుద్ధరణ, కాంటూరు కందకాలు, వర్షపునీటి నిల్వ చేసే కృత్రిమ చెరువుల నిర్మాణాలు, చెక్‌డ్యామ్ వంటి నిర్మాణాలు, గ్రామాలు, ఆవాసాలలో ఇంకుడు గుంతల నిర్మాణాల్లో నిర్ణీత లక్ష్యానికి మించిచేసిన పనులు సంతృప్తికరంగా ఉండడంతో ఈ అవార్డుకి జిల్లాని మొదటి కేటగిరీ కింద ఎంపిక చేశారు. ఈ కేటగిరీ కింద ఇచ్చే పురస్కారాలను ఈ నెల 18న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అందజేస్తారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఆర్‌డీఏ పీడీ వై శేఖర్‌రెడ్డి హాజరవుతారు. ఈ పురస్కారంతో పాటుగా రూ.2 కోట్ల నగదు బహుమతి సైతం జిల్లా అధికారులకు అందజేస్తారు. జిల్లాకు ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర పురస్కారం రావడంపై కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని అభినందించారు.

జిల్లాలో 13 విభాగాల్లో 84,827 పనులు

జల్ సంచయ్, జనభాగీధారి కార్యక్రమం కింద జిల్లాలో వర్షపునీటి సంరక్షణ, భూగర్భజలాల సంరక్షణకు 13 రకాలైన పనులను చేపట్టారు. మొత్తం 84,827 పనులను రూ.98.02 కోట్లతో నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి, నీటినిర్వహణ యాజమాన్యసంస్థ ఆధ్వర్యంలో ఈ పనులను ప్రతిష్ఠాత్మకంగా పూర్తిచేశారు. ప్రధానంగా వర్షపునీటిని, వరద నీటిని నిల్వ చేసే పనులను చేపట్టారు. కాంటూరు కందకాలు, నీటి కందకాలు, చెరువుల పునరుద్ధరణ, పాతబావుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు, ఇంకుడుగుంతల వంటి నిర్మాణాలు చేపట్టారు. ఈ పనులను నిర్ణీత గడువు ప్రకారం పూర్తిచేసి ఎప్పటికప్పుడు

మిగతా 8వ పేజీలో

జిల్లాలో చేపట్టిన పనుల వివరాలు

పనివివరం	పనుల సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
గుట్టల ప్రాంతాల్లో కాంటూరు కందకాలు	128	1.28
వ్యవసాయ గట్ల వద్ద కందకాల నిర్మాణాలు	1256	12.56
వర్షపు, వరద నీటి నిల్వ కందకాలు	658	6.58
వదులుగా ఉండే రాతి నిర్మాణాలు	2956	3.84
రాక్‌ఫిల్ డ్యామ్‌ల నిర్మాణాలు	896	1.79
తీగబుట్టలతో తయారుచేసిన నిర్మాణాలు	63	2.21
మినీ కృత్రిమచెరువులు	463	4.63
వర్షపునీరు ఇంకేందుకు తవ్విన కృత్రిమచెరువులు	127	4.45
చెక్‌డ్యామ్‌లు	253	4.53
మట్టికట్టపనులు	7596	7.59
వ్యవసాయచెరువులు	9495	23.73
బోరుబావుల రీచార్జి నిర్మాణాలు	792	15.84
ఇంకుడుగుంతలు	60,144	9.27
మొత్తం	84,827	98.02

జాతిని ఏకీకృతం చేయడంలో పటేల్ పాత్ర కీలకం

- ఎంపీ కేసరి దేవ్ సిన్హా జ్వాల
- నల్లగొండలో యూనిటీ ర్యాలీ



యూనిటీ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ కేసరి దేవ్ సిన్హా జ్వాల

నల్లగొండ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత, దేశభక్తిని పెంపొందించడం, ప్రత్యేకించి జాతిని ఏకీకృతం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర కీలకమని ఎంపీ కేసరి దేవ్ సిన్హా జ్వాల అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సర్దార్ 150 యూనిటీ మార్చ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో జాతి నిర్మాణంలో యువతను ప్రోత్సహించడం, యువత ఆలోచనలను ఆచరణలో పెట్టి దేశ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మార్చ్‌కు హాజరైన అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రమాణం చేశారు. ఈ యూనిటీ మార్చ్ నాగార్జున డిగ్రీ కళాశాల నుంచి బయలుదేరి క్లాక్‌టవర్ సెంటర్, ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు కొనసాగింది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నారాయణ అమిత్, ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి అక్బర్ అలీ, మై భారత్ స్టేట్ సభ్యులు అనుస్మాన్, ప్రసాద్ దాస్, యూత్ కోఆర్డినేటర్ రాజేష్, సాయి కృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, చంద్రశేఖర్, పోతేపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, మండల వెంకన్న, మహేష్ పాల్గొన్నారు.

వయోవృద్ధులతో ప్రేమగా ఉండాలి

- కలెక్టర్ ఇలాత్రిపాఠి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ(కలెక్టరేట్), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులతో ప్రేమగా మెలగాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి, బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలాత్రిపాఠి మాట్లాడుతూ వృద్ధులు ఆయురారోగ్యాలతో ఉన్నప్పుడే కుటుంబం ఆనందంగా ఉంటుందన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జిల్లాస్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 13న వృద్ధ ఆశ్రమాల్లో ఆటల పోటీలు, వినోద కార్యక్రమాలు ఉంటాయని, 14న వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు, 15న సీనియర్ సిటిజన్ హక్కులపై మారథాన్ వాక్, 17న జిల్లా, డివిజన్‌స్థాయిలో సీనియర్ సిటిజన్ చట్టం-2007పై అవగాహన, 18న ప్రజాప్రతినిధులకు అవగాహన ఉంటుందన్నారు. 19న జిల్లాలోని వయోవృద్ధులకోసం పనిచేసిన వారి సేవలను గుర్తించి సన్మాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి కేవీ కృష్ణవేణి, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, డీఆర్డీఏ పీడీ శేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ సంస్థ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ హాఫీజ్‌ఖాన్

నల్లగొండ కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ 58వ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 తేదీవరకు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా చైర్మన్ ఎం.ఏ హఫీజ్‌ఖాన్ తెలిపారు. బుధవారం జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14వ తేదీన భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలలదినోత్సవం, 15వ తేదీన నూతన పుస్తకాల ప్రదర్శన, రీడింగ్ అవర్, 16వ తేదీన గ్రంథాలయ, డిజిటల్ లైబ్రరీపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. దాతల నుంచి పుస్తకాల సేకరణ, గ్రంథాలయ ఉద్యమకారుల సేవలను స్మరించుకోవడం వంటి కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. 17న ధ్యానం, వ్యక్తిత్వ వికాస కార్యక్రమం, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచనపోటీలు, ఉత్తమ గ్రంథాలయ పాఠకులు, పాఠకురాలికి సన్మానం, బుచ్చిరెడ్డి రచించిన ఊగుతున్న ఉయ్యాల బాలగేయ పుస్తకావిష్కరణ ఉంటుందని తెలిపారు. 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, నా గ్రంథాలయం- నాకు ప్రోత్సాహంపై చర్చావేదిక, గ్రంథాలయంలో చదువుకుని ఉద్యోగం సాధించిన వారి ఉపన్యాసాలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా ముగ్గులు, రంగోళి పోటీలు, పిల్లల కుర్చీ ఆట, మహిళలతో చర్చావేదిక, 20న అక్షరాస్యతా దినోత్సవంతోపాటు వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. పట్టణ ప్రజలు, కవులు, రచయితలు, సాహితీవేత్తలు, పాఠకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బానోతు బాలమ్మ, గ్రంథపాలకులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు

- ఉద్యాన, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి పి. అనంతరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అనంతరెడ్డి

తిప్పర్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించాలని ఉద్యాన, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి పి.అనంతరెడ్డి అన్నారు. బుధవారం తిప్పర్తి మండలం కంకణాలపల్లిలో ఉద్యాన, వ్యవసాయ శాఖల సమన్వయంతో పీఏసీఎస్ చైర్మన్ పాశం సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ రైతులు మూడేళ్లు ఆయిల్ పామ్ సాగుచేస్తే 30 ఏళ్లు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి కృష్ణ, పలు కంపనీ ప్రతినిధులు వేణు పాల్గొన్నారు.

బిందు సేద్యం కోసం ఎన్నాళ్లో.. ఈ నిరీక్షణ

- రైతులకు డ్రిప్ మంజూరులో నిర్లక్ష్యం



నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాలతోపాటు వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలకోసం ప్రభుత్వం బిందు సేద్యం అమలు చేయాలని చూసినా, నల్లగొండ జిల్లాలో మాత్రం పరికరాల పంపిణీ ఆలస్యమవుతుంది. దీంతో రైతులకు నిరీక్షణ తప్పడంలేదు. డ్రిప్ మంజూరుకోసం దరఖాస్తులు సమర్పించి నెలలు గడుస్తున్నా దరఖాస్తుల పరిశీలన ముందుకు సాగడంలేదు. ఉద్యానశాఖ యంత్రాంగం పట్టించుకోకపోవడం వల్లే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, సకాలంలో డ్రిప్ పరికరాలు రావడం లేదని రైతులు వాపోతున్నారు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

పండ్ల తోటలు మొదలుకొని కూరగాయల సాగు వరకు డ్రిప్ అవసరం ఎంతగానో ఉంటుంది. ముఖ్యంగా నీటివనరులు తక్కువగా ఉన్నప్పుడు డ్రిప్ ఏర్పాటు చేసినట్లయితే ఉద్యాన పంటలకు ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. గత బీఆర్ఎస్ హయాంలో దాదాపు ఐదేళ్లపాటు బిందు సేద్యానికి నిధులు కేటాయించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరం తర్వాత బిందు సేద్యానికి కేటాయించినా, జిల్లాలో మాత్రం ఆ పథకం అటకెక్కింది. దీన్ని ప్రధాన కారణం అధికారుల నిర్లక్ష్యమనేది స్పష్టంగా తెలుస్తుంది. గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత ప్రభుత్వంలో సైతం బడ్జెట్‌లో బిందు సేద్యానికి అరకొరగా నిధులు కేటాయిస్తూ వస్తుంది. కనీసం ఆ నిధులైనా ఖర్చు చేసి పథకాన్ని అమలు చేయాల్సిన అధికారులు ఫైళ్లను అటకెక్కించారన్న ఆరోపణలు వస్తున్నాయి.

రీఎస్టిమేషన్ పేరిట కాలయాపన

కేంద్ర ప్రభుత్వం పలు రంగాలపై, పరికరాలపై, వస్తువులపై జీఎస్టీ తగ్గించిన తర్వాత ఎంతో ఊరట కలిగింది. ఇందులో భాగంగా డ్రిప్ సామగ్రిపై సైతం 12శాతం నుంచి 5శాతానికి తగ్గడం వల్ల రైతులకు ఈ పథకం ఎంతగానో ఉపయోగంలోకి వస్తుందని రైతులు సర్వత్రా భావించారు. అయితే రైతులకు ప్రయోజనం చేకూర్చడంకోసం ఫైళ్లను పరిశీలిస్తామని, రేట్లు తగ్గినందున రైతులకు డీడీలు కట్టే సమయంలో ఉపయోగం ఉంటుందని చెబుతున్నా, ఉద్యానశాఖ అధికారులు ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారన్న ప్రశ్న తలెత్తుతుంది.

తగ్గిన యంత్ర పరికరాల ధరలు

వ్యవసాయశాఖకు సంబంధించి యాంత్రీకరణ పథకంలో యంత్ర పరికరాలకు సైతం జీఎస్టీ వల్ల ధరలు తగ్గాయి. వ్యవసాయశాఖ ఈపాటికే స్పందించి తగ్గినరేట్లకు అనుగుణంగా పథకాన్ని అమలుచేస్తూ ముందుకు సాగుతుంది. ఉద్యానశాఖ ఈ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారనే దానిపై సర్వత్రా చర్చ సాగుతుంది. రైతులకు ఉపయోగం కలుగుతున్న నేపథ్యంలో తక్షణమే రిఎస్టీమేషన్ చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న 1000 ఫైళ్లకు పైగా సకాలంలో పరిశీలించి పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత శాఖపై ఉన్నా, అధికారులు మాత్రం ఆ వైపుగా దృష్టిసారించడంలేదు. రిఎస్టీమేషన్ చేయడంకోసం ఎందుకు ఇంత సమయం తీసుకుంటున్నారన్న ప్రశ్న తలెత్తుతుంది. జీఎస్టీ తగ్గిన వెంటనే ఆయా కంపెనీల నుంచి కొత్తగా కొటేషన్ తీసుకొని రైతులను ఎంపిక చేసి వారి నుంచి డీడీలను సకాలంలో

మిగతా 8వ పేజీలో..

జనగణన సర్వే వేగవంతం చేయాలి

- తెలంగాణ డైరెక్టర్ భారతీ హోలీకేరి



వివరాలు తెలుసుకుంటున్న హోలీకేరి

తిప్పర్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జనగణన కార్యక్రమంలో భాగంగా చేస్తున్న సర్వే వివరాలను వేగవంతం చేయాలని ఆ శాఖ తెలంగాణ డైరెక్టర్ భారతి హోలికేరి ఆదేశించారు. తిప్పర్తి మండల కేంద్రంలో జనగణన కార్యక్రమాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఎన్యుమరేటర్ సర్వే చేస్తున్న ప్రదేశాలను స్వయంగా వెళ్లి పరిశీలించారు. సర్వేలో భాగంగా ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తహసీల్దార్ ఆర్. రామకృష్ణ, ఎస్ఐ. వి. శంకర్, ఆశాఖ అధికారులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

నల్లగొండ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. బీసీలకు చట్టసభల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు సాధించేంచే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ ఉద్యమం ప్రజాస్వామ్య బద్ధంగా బీసీల ఆత్మగౌరవం కోసం, అవమానాలకు వ్యతిరేకంగా కొనసాగుతుందన్నారు. రాష్ట్రాలు రిజర్వేషన్లు పెంచుకోవచ్చని రాజ్యంగంలోని 243/డి6 షెడ్యూల్ స్పష్టంగా ఉందన్నారు. కానీ రిజర్వేషన్లు 50 శాతానికి పరిమితం చేయడం ఏంటని ప్రశ్నించారు. బీసీలు ఎంత ఉన్నారో. తమకు అంత రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్, చిలకరాజు సతీష్, పుట్ట వెంకన్న గౌడ్, చెన్నూరి భరద్వాజయాదవ్, కొంపల్లి రామన్నగౌడ్, పృథ్వీరాజ్, మహేష్ కుమార్, మణికంఠ, రాజేష్, రవి, తరుణ్, మల్లేష్, పృథ్వీ, రామ్ చరణ్, సాయి తేజ, శంకర్, యాదగిరి, సత్యనారాయణ ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంఘాల నాయకులు

కృష్ణాజలాలు అందాయా.. ఆలోచించండి

- సమస్యలు తెలుసుకోవడానికే జనంబాట
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

7

ప్రసవాల నిర్వహణలో రాష్ట్రంలోనే ముందు

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ప్రత్యేక దివ్యాంగ గుర్తింపు కార్డుల జారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రసవాల నిర్వహణలో జిల్లాకేంద్ర ఆసుపత్రి రాష్ట్రంలోనే ముందుందని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డివెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రూ.30లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల జారీ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఉస్మానియా, గాంధీ తర్వాత ఎక్కువగా ప్రసవాలు నిర్వహించే అతిపెద్ద ఆస్పత్రిగా నల్లగొండ జీజీహెచ్ పేరుపొందిందని, ప్రతీనెల 700 నుంచి 800 వరకు ప్రసవాలు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఉన్న సదరం శిబిరం కేంద్రంలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కాదని, సౌకర్యాల లేమితో వైకల్యం కలిగిన వారు అనేక ఇబ్బందులు ఎదుర్కోవడాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.30లక్షలతో నూతన భవనాన్ని నిర్మించి దివ్యాంగులకు కొత్త భవనంలో తాగునీరు, టాయిలెట్స్, ర్యాంపు, ఇతర అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైకల్యం కలిగిన వారు ఇక ప్రతీవారం ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్టిఫికెట్లు పొందవచ్చన్నారు. ఆసుపత్రిలో అన్ని అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇటీవలే బేబీ వార్మ్, లాప్రోస్కోపిక్ మిషన్ వంటివి ఏర్పాటు చేశామని, రూ.2లక్షల నుంచి రూ.3లక్షల విలువ చేసే ఆపరేషన్లు సైతం ఉచితంగా చేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైతే ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తామన్నారు. ప్రసవాలకోసం ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా జిల్లా కేంద్ర ఆస్పత్రికి రావాలన్నారు. వైద్యసేవలలో నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలపాలన్నదే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలాత్రిపాఠి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ కుమారి, ఆర్ఎంవో పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను సవ్యంగా పూర్తిచేయాలి

నల్లగొండ (కలెక్టరేట్): అధికారులు, రైస్ మిల్లర్లు రాత్రి, పగలు పనిచేసి ధాన్యం కొనుగోలును సవ్యంగా పూర్తిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. కలెక్టరేట్‌లో ధాన్యం, పత్తి సేకరణ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అకాల వర్షాలు, తుఫాన్‌తో ధాన్యం సేకరణలో ఇబ్బందులు కలిగాయని, కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున, అవసరమైతే లైట్లు ఏర్పాటుచేసి రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరసరఫరాల జిల్లా అధికారి వెంకటేష్, జిల్లా మేనేజర్ గోపికృష్ణ, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..ఆరోగ్యం..ప్రశాంతత

- ఏటా పెరుగుతున్న అయ్యప్ప మాలధారులు
- శబరికొండ సన్నిదానంలో 200 మంది సామూహిక పూజలు

చింతపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల యువతలో ఆధ్యాత్మిక చింతన పెరగడంతో మాలధారుల సం ఖ్య ఎక్కువైంది. మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్), గొడకొండ్ల, పోలేపల్లి, రాంనగర్, నల్లవెల్లి, తిరుగండ్లపల్లి, తమ్మలోనిగూడెం, చింతపల్లి, మదనాపురం, కిషన్‌పల్లి, కుర్మపల్లి గ్రామాలకు చెందిన 200 మంది భక్తులు అ య్యప్ప దీక్షలు చేపట్టారు. వీరు దీక్షలు తీసుకోవడంతో పాటు నియమాలను పాటిస్తూ పూజలు చేస్తున్నారు. వీ రంతా ప్రధానంగా గొడకొండ్ల శబరికొండ అయ్యప్ప సన్నిదానంలో కార్తీక మాసం ప్రారంభం నుంచి జనవరి 16 మకర సంక్రాంతి వరకు దీక్షలు చేసుకొని ఇరుముడితో శబరిమలైకు వెళ్తారు. గొడకొండ్ల రిజర్వాయర్‌గా ఎదురుగా నెలకొన్న శబరికొండ అయ్యప్ప ఆలయంలో ప్రతి ఏడాది డిసెంబరు 18న అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో వైభవంగా మహాపడి పూజ నిర్వహిస్తున్నారు. భక్తుల సహకారంతో ఆలయంలో అయ్యప్ప మహాపడి పూజ చేస్తుంటారు.


గొడకొండ్ల(వీ.టీ.నగర్) అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు (ఫైల్)

ఆరోగ్య ప్రయోజనాలు

అయ్యప్ప మాలధారులు పాటించే నియమాలతో పలు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆధ్యాత్మికవేత్తలు, వైద్యులు చెబుతున్నారు. ఉదయం 5 గంటలకు చల్లని నీటితో స్నానం చేసి పూజలు చేసుకొని తిరిగి సాయంత్రం 6.30 మళ్లీ చల్లని నీటితో స్నానం చేసి పూజలు చేస్తుంటారు. చన్నీళ్ల స్నానం చేయడంతో ఏకాగ్రత, శరీరంలో శక్తి పెరగడంతో పాటు రక్తపోటు సైతం తగ్గుతుంది. నుదుట చందనం, కుం కుమ, విబూది పెట్టుకోవడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. శాకాహార భోజనమే చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మంచి దినచర్య అలవడుతుంది. కాళ్లకు చెప్పులు ధరించపోవడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడుతుంది. నిత్యం స్వామి మంత్ర పఠనంలో ఉండటం వల్ల మానసిక ప్రశాంతత, సాత్విక గుణం అలవడతాయి.

నియమాలే ఇష్టంగా


నేను మొదటిసారిగా అయ్యప్ప దీక్ష తీసుకున్నా. దీక్ష నియమాలు ఎంతో కఠినంగా ఉన్నప్పటికీ మాలధారణంతో నియమాలన్నీ ఇష్టాలుగా మారుతాయి. సూర్యోదయానికి ముందుగా నిద్ర లేవడం, చల్లని నీటితో స్నానం చేయడం స్వామికి ప్రత్యేక పూజలు చేయడం, ఆహార నియమాలు పాటించడం రాత్రి నేలపై పడుకోవడం వంటి నియమాలతో మనసు ఎంతో ప్రశాంతంగా ఉండడంతో ఆరోగ్య సైతం సిద్ధిస్తుంది.

-పల్లేటి వంశీ(కన్నెస్వామి) వీటీ నగర్

ప్రశాంతంగా ఉంటుంది


అయ్యప్ప దీక్ష తీసుకోవడంతో ప్రశాంతంగా ఉంటుంది. మొదటిసారి మాలధారణ వేసుకొని దీక్ష చేస్తున్నా. అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో సామూహికంగా గడపడం, అయ్యప్ప మహాపడి పూజలకు వెళ్లడం చాలా సంతోషంగా ఉంటుంది. నామాలను పఠించడం కఠిన నియమాలు పాటించడం ఎంతో ప్రశాంతంగా అనిపించింది. ఎంత కష్టమైనా అన్ని నియమాలు తప్పని సరిగా పాటిస్తాం.

-ఆరేకంటి వీరేందర్ , (కన్నెస్వామి) వింజమూర్

ప్రతి ఒక్కరూ నియమాలను పాటించాలి


మాల వేసుకున్న ప్రతి ఒక్కరూ కచ్చితంగా దీక్ష తీసుకొని నియమాలను పాటించాలి. బ్రహ్మచర్య దీక్ష అనగానే భయం ఉన్నప్పటికీ దీక్ష చేయడంలో సంతోషంగా ఉంటుంది. నేను 30 ఏళ్లగా అయ్యప్ప మాల వేసుకొని పవిత్రంగా దీక్ష చేస్తాం. 41 మండల దీక్ష పూర్తి చేసుకున్న స్వాములకు ఇరుముడి కట్టి శబరిమాలకు బయలుదేరి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

-మల్లోజు జగదీశ్వరాచారి(గురుస్వామి)

నేడు అయ్యప్ప మహాపడి పూజ

పెద్దఅడిశర్లపల్లి,నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన గల పార్కులో గురువారం అయ్యప్ప మహాపడిపూజ నిర్వహిస్తున్నట్లు గురుస్వామి అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురుస్వామి సత్యనారాయణ స్వామి చేతుల మీదుగా 18 మెట్ల కలశ పూజ వైభవంగా చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు.

బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా లింగంగౌడ్


మిర్యాలగూడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్‌గా పట్టణానికి చెందిన జాజుల లింగంగౌడ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో లింగంగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పార్టీలకతీతంగా బీసీలందరినీ ఏకం చేసి రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా పని చేస్తానన్నారు. తన ఎన్నికకు సహ కరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జలసంరక్షణలో జిల్లాకు కేంద్ర పురస్కారం

(5వ పేజీ తరువాయి)


మాడ్గులపల్లి మండలం చెర్వుపల్లి వద్ద పునరుద్ధరించిన చెరువు

కేంద్ర జలశక్తిశాఖ వెబ్‌సైట్‌లో ఫొటోలతో వివరాలను పొందుపరిచారు. 1 సెప్టెంబరు 2024 నుంచి 31 మే 2025 వరకు చేపట్టిన పనుల ఆధారంగా పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ పనులను పరిశీలించే నిమిత్తం జి ల్లాలో కేంద్రజలశక్తి శాఖ అధికారుల బృందం జూన్ 19 నుంచి జులై 15వరకు రెండు బృందాలుగా ఏర్పడి పనులను పరిశీలించారు. మొత్తం 849 పనులను ఈ బృందాలు ర్యాండమ్‌గా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు, కేంద్రానికి నివేదించడంతో పురస్కారానికి లైన్‌క్లియర్ అయింది.

సంతోషంగా ఉంది


జిల్లాలో చేపట్టిన జలసంచయ్, జన్‌భాగీదారి కార్యక్రమం చేపట్టిన పనులకు కేంద్ర జలశక్తి శాఖ పురస్కారం ప్రకటించడం సంతోషంగా ఉంది. కలెక్టర్ ఇలా త్రిపాఠి సూ చనలతో మేం ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో ఈ పనులు చేపట్టి సకాలంలో పూర్తిచేశాం. నీటివనరుల కొరత ఉన్న ప్రాంతాల్లో వర్షపునీటిని సంరక్షించడంతో పాటుగా, భూగర్భజలాలు పెంచడమే కేంద్రంగా ఈ పనులు గుర్తించి నిర్వహించాం. కలెక్టర్ ప్రోత్సాహం, రైతులు, గ్రామస్తుల సహకారంతో పాటుగా గ్రామీణాభివృద్ధిశాఖ అవిరళ కృషికి దక్కిన గౌరవంగా ఈపురస్కారాన్ని భావిస్తున్నాం. జిల్లాలో మరిన్ని ఉపయుక్తకరమైన కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ పురస్కారం స్ఫూర్తినిస్తుంది.

- శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీవో

ఎన్నాళ్లో ఈ నిరీక్షణ


బిందు సేద్యంలో సాగువుతున్న తోట

(5వ పేజీ తరువాయి)

తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదనేది స్పష్టమవుతుంది.

జిల్లాకు రూ.2.48కోట్ల నిధులు విడుదల

రాష్ట్ర ప్రభుత్వం బిందు సేద్య పథకం అమలుకోసం జిల్లాకు రూ.2.48కోట్లను కేటాయించినట్లు సమాచారం. నిధులు విడుదలైనా అధికారులు మాత్రం రైతులకు సకాలంలో డ్రిప్ మంజూరు చేయకపోవడంతో పండ్లతోటల విస్తీర్ణంతోపాటు కూరగాయల సాగు ముందుకు సాగడంలేదు. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం కూరగాయల సాగును, పండ్లతోట విస్తీర్ణాన్ని పెద్దఎత్తున చేపట్టాలని యోచిస్తున్నా అందుకనుగుణంగా జిల్లాలో ప్రణాళికబద్ధంగా పనులు సాగడం లేదనేది స్పష్టమవుతుంది. ఒకేసారి రూ.2.48కోట్లతో లబ్ధిదారులను ఎంపికచేసి డ్రిప్ మంజూరు చేయాలనే ఆలోచన కాకుండా మూడు విడతలుగా ఈ నిధులను ఖర్చు చేయాలని అధికారులు యోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పథకం అమలును వేగవంతం చేయాల్సిన అధికారులు ఆ ప్రక్రియను నత్తనడకన సాగేలా చూడటంతోపాటు ఇంత వరకు ఆ వైపు ఒక అడుగు కూడా ముందుకు వేయకపోవడంతో రైతులకు అసలు ఎప్పటికి డ్రిప్ పరికరాలు అందుతాయనే దానిపై అయోమయం నెలకొంది. జిల్లాలో ఇప్పటికే తోటలు, కూరగాయల సాగు చేయాలన్న రైతులకు అధికారుల నిర్లక్ష్యంవల్ల డ్రిప్ అందకపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. జీఎస్టీ తగ్గిన తర్వాత మరింత వేగంగా సేవలు అందించాల్సిన అధికారులు నాన్చుడి ధోరణి అవలంబిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా అధికారులు పథకం ప్రారంభించడంతోపాటు డ్రిప్ పరికరాల సామగ్రి విషయంలోనూ నాణ్యతను పరిశీలించి అందుకు సంబంధించిన కంపెనీలను ఎంపిక చేయాల్సి ఉంది. రైతులనే స్వయంగా వారికి నచ్చిన కంపెనీలను ఎంపిక చేసుకుని డ్రిప్‌ను పొందేలా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది.

ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- మిర్యాలగూడ మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ గణవేణి శ్రీనివాస్ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో పీఎం స్వనిధి పథకంపై బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం పేదలకు అందించే రుణాలను త్వరగా మంజూరు చేయాలన్నారు. సకాలంలో రీపేమెంట్ చేస్తే రుణ లబ్ధి పెరుగుతుందన్నారు. మెప్మా సిబ్బంది పక్ష పాతం చూపకుండా అర్హులందరికీ రుణాలు అందేలా పనిచేయాలని సూచించారు. సమావేశంలో కోఆర్డినేటర్ శివాజీ, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్

కొనుగోలు కేంద్రంలోనే ధాన్యానికి మద్దతు ధర


మాడ్గులపల్లి : ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సరోజపావని.

మాడ్గులపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని తహసీల్దార్ సరోజ పావని అన్నారు. మండలంలోని కన్నెకల్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించి ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులు పండించిన నాణ్యమైన ధాన్యాన్ని తగిన తేమ శాతంతో తీసుకొస్తే ప్రభుత్వం అందించే మద్దతు గరిష్ఠ మద్దతు ధర లభిస్తుందని అన్నారు. కేంద్రం నిర్వాహకులు సెంటర్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యంలో తేమశాతం సరిగా ఉంటే వెంటనే కాంటాలు వేసి కొనుగోలు చేయాలన్నారు. ఆమె వెంట గ్రామ పరిపాలన అధికారి సతీష్ ఉన్నారు.

లింగంపల్లిలో ధాన్యం సేకరణ కేంద్రం ప్రారంభం

పెద్దవూర : పెద్దవూర రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మండలంలో లింగంపల్లి గ్రామంలో సన్నరకం ధాన్యం సేకరణ కేంద్రాన్ని హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చే సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్‌ను అందిస్తుందని తెలిపారు. రైతులు ధాన్యాన్ని 17శాతం తేమ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కేంద్రం నిర్వాహకులు రైతుల వద్ద నుంచి ధాన్యం త్వరితగతిన కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో హాలియా ఏడీఏ సరిత, పెద్దవూర వ్యవసాయాధికారి సందీప్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకురాలు చామల సువర్ణ భాస్కర్‌రెడ్డి, మధుకర్, స్వాతి, ఎఫ్‌సీవో చైర్మన్ సోమకృష్ణమూర్తి, డైరెక్టర్లు సోమ పవన్‌కుమార్, మట్టపల్లి అంజిరెడ్డి, శ్రీనునాయక్, రైతులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన

కొండమల్లేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలో బుధవారం రైతులకు పామ్ ఆయిల్ సాగుపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతు సహకార సంఘం అధ్యక్షుడు వే ణుధర్‌రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ రవినాయక్ పామ్ ఆయిల్ పంట ఎకరానికి 57 మొక్కలు నాటుకోవచ్చునని, వరి కంటే ఎక్కువ లాభాలు సాధించవచ్చునని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పతంజలి కంపెనీ ప్రతినిధులు వంశీ, ఏవో జానకీరాములు, ఏఈవో సురేష్, మల్లేష్, మాధురి, సెక్రెటరీ వల్లా తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు అమర్‌సింగ్, రాజు, గ్యార శ్రీను తదితరులు పాల్గొన్నారు.


పామాయిల్ సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాల్య వివాహాలను నిర్మూలించాలి


తిరుమలగిరి(సాగర్)లో మాట్లాడుతున్న సీడీపీవో శాంతి

దేవరకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బాల్య వివా హా లను నిర్మూలించాలని మండలంలోని కొండభీమనపల్లి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధ అన్నారు. కొండభీమనపల్లి అంగన్ వాడీ కేంద్రంలో బుధవారం కిశోర బాలికలకు 'బేటి బచావో బేటి పడావో' కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. బాల్యవివాహాలు చటరీత్యా నేరమని అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేయడంతో అనర్థాలు జరుగుతాయన్నారు. పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవాలని ఆమె తెలిపారు.

● కొండమల్లేపల్లి : విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పా టించాలని సీడీపీవో ఖతీజాబేగం సూచించారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహా లు, లింగ వివక్ష, మిషన్ వాత్సల్య, 1098 హెల్ప్‌లైన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో సిబ్బంది అంజలి, రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● త్రిపురారం : ఐసీడీఎస్ దామరచర్ల ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని కాపువారిగూడెం, లచ్యతండా గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లలో బుధవారం పిల్లల తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు నేరమని, 18 ఏళ్లలోపు బాలికల వివాహం చట్ట విరుద్ధమన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మల్లేశ్వరి లక్ష్మీ, శారద, సునీత, లలిత, కైక పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) : కిశోర బాలికలు వ్యక్తి పరిశుభ్రతను అలవర్చుకోవాలని సీడీపీవో శాంతి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు పలు అంశాలను వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలను సూచించారు . ఈ విషయంలో ప్రభుత్వం 1098 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేసిందని ఎవరైనా బాల్య వివాహాలకు బలవంతం చేస్తే సమాచారం అందించాలని సూచించారు. భ్రూణహత్యలు, శిశువిక్రయాలు, అక్రమ రవాణా లాంటిని పాల్పడితే చట్టంలో కఠిన శిక్షలు ఉన్నాయనిన ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో కవిత, ఏసీడీపీవో సువర్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు యాదమ్మ, విజయలక్ష్మి, కేజీబీవీ, అంగన్‌వాడి టీచర్లు, పాల్గొన్నారు.

● గుర్రంపోడు : మండలంలోని చేపూరు, తేనేపల్లి ఉన్నత పాఠశాలల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సువర్ణ, ప్రమీల మాట్లాడుతూ అక్ర మ దత్తత, బాల్యవివాహాలు చటరీత్యా నేరమన్నారు. ఆడపిల్లలకు ఆపద వస్తే చైల్డ్ హెల్ప్ లైన్‌నెంబరు 1098కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనురాధ, మంగ్లనాయక్, అంగన్‌వాడీ టీచర్లు సుశీల, అనిత, రేణుకా, సైదమ్మ, ఏఎన్‌ఎం ఇందిర తదితరులున్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

తిరుమలగిరి(సాగర్) నవంబరు12(ఆంధ్రజ్యోతి): ప్రసవం కోసం అత్యవసరంగా ఆసుపత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లో మహిళ మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన తిరుమలగిరి(సాగర్) మండల కేంద్ర సమీపంలో చోటుచేసుకుంది. 108 సిబ్బంది, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొంపెల్లి గ్రామానికి చెందిన చింతమల్ల సంధ్య బుధవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో అమె బంధువులు 108కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో తెల్లవారుజామున 5 గంటల ఐదు నిమిషాలకు 108 సిబ్బంది కొంపల్లి గ్రామానికి సుమారు ఐదున్నర గంటలకు చేరుకున్నారు. గర్భిణిని 108లో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మండల కేంద్రానికి సమీపంలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ ఫిజిషియన్(ఈఆర్‌సీపి)వైద్యుడు డాక్టర్ శివ సూచనల మేరకు 108 అంబులెన్స్ ఈఎంటీ రాకేష్, పైలట్ రాకేష్ గర్భిణికి సాధారణ ప్రసవం అయ్యేలా వైద్యం నిర్వహించారు. దీంతో ఆమె మగ బిడ్డక జన్మనిచ్చింది.దీంతో మహిళ బంధువులు ఆనందం వ్యక్తం చేస్తూ 108 సిబ్బందిని అభినందించారు.


అంబులెన్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చిన సంధ్య

ప్రజా సమస్యలపై ప్రజానాట్య మండలి పోరు

- డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్



సభలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్

మిర్యాలగూడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ప్రజానాట్య మండలి పోరుబాట సాగిస్తుందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడావత్ రవినాయక్ అన్నారు. స్థానిక పీఎన్ఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించడం లేదని అన్నారు. కేవలం రాజకీయ లబ్ధి అధికారం నిలబెట్టుకోవడానికి సమస్యలపై ప్రజల దృష్టిని మరల్చి వేడుక చూస్తున్నాయన్నారు. కార్పొరేట్ కంపెనీ సేవల్లో కేంద్రం తరిస్తుండగా రాష్ట్రంలో వైద్యం, విద్య, సంక్షేమ రంగాలను గాలికి వదిలివేశారని ఆరోపించారు. రైతులు, కార్మికులు, మహిళలు అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజానా ట్య మండలి కళాకారులు ఉద్యమ గీతాలు, వీధి నాటకాలు, కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చి ఉద్యమాలు నిర్వహించేలా పోరుబాట సాగిస్తారని అన్నారు. అనంతరం పీఎన్ఎం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కుమ్మరి సైదులు, కార్యదర్శిగా చిరంజీవులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పీఎన్ఎం జిల్లా సహాయకార్యదర్శి పుట్టల సైదులు, జిల్లా కమిటీ సభ్యులు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్న ప్రసాద వితరణ


భిక్ష చేస్తున్న అయ్యప్ప మాలధారులు

నిడమనూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ఎన్‌సీఎం ఫౌండేషన్ చైర్మన్ నల్లగొండ ఆంజనేయులు సహకారంతో బుధవారం 200 మంది అయ్యప్ప, అంజనేయస్వామి, శివ మాలదారులకు అన్నదానం చేశారు. స్వాములకు అన్న ప్రసాద వితరణ చేసిన దాత అంజనేయులును పలువురు అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు మల్లేష్, రాకేష్, బండి కిరణ్, గురుస్వామి జూపల్లి నాగరాజు, మాలధారులు పాల్గొన్నారు.

ఎక్స్‌రోడ్‌లో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

చింతపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ సమీపంలో రేషన్‌దుకాణం ఏర్పా టు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రేషన్ దుకాణం రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో లబ్ధిదారులు రేషన్ సరుకులు తీసుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ నాయకులు ఎల్లంకి ఆశోక్, ఎండీ.ఖలేద్, వందనపు ఆంజనేయులు పాల్గొన్నారు.

భారతమ్మకు మాజీ ఎమ్మెల్యే నివాళి


భారతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

చింతపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘడియాగౌరారం గ్రామానికి చెందిన ఉజ్జిని భారతమ్మ ఇటీవల మృతి చెందారు. గ్రామంలో బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఉజ్జిని రఘురాంరావు, నరేందర్ రావు, ఎండీ ఖలేద్, గిరి, బొడ్డుపల్లి కృష్ణ. పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

కొండమల్లేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంతి వేడుకలను స్థానిక సత్యసాయి ఆధ్యాత్మిక సేవా ఆశ్రమ ధర్మక్షేత్రంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో సాయి గాయత్రి మహాయజ్ఞాన్ని నిర్వహించారు. సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవలను గుర్తుచేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు సముద్రాల జ్ఞానేశ్వర్, సముద్రాల ధనయ్య, మురళీ, రాచమళ్ల నర్సింహ, బ్రహ్మానందరెడ్డి, వింజమూరు చంద్రమౌళి, ఏరుకొండ రాము, నూతనగంటి జగన్, అలు గుబెల్లి నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సత్యసాయి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులు